ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 5 ఏప్రిల్ 2026 | సంపుటి: 28 సంచిక: 14
Sunday 5 April 2026 | Vol.No 28 Issue No .14
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## ఇంటా, బయటా ఎదురైన సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నాం: జైశంకర్



న్యూఢిల్లీ,ఏప్రిల్4 : ఇతర దేశాల నుంచి మాత్రమే కాకుండా, అంతర్గతంగా ఎదురైన సవాళ్లను భారత్ విజయవంతంగా ఎదుర్కొందని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. వివిధ రూపాల్లో ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లు భారత్ సామర్థ్యాలను పరీక్షిస్తూనే ఉన్నాయని అన్నారు. ఐఐఎం రాయ్‌పూర్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన మిగతా2లో..

# బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

- రూ.225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్మాణాలు
- 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు సిఎం శంకుస్థాపన
- అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్4 : బాసర ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 6న బాసర సరస్వతి ఆలయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ. 225 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించి సమగ్ర మాస్టర్ ప్లాన్ ఇప్పటికే సిద్ధం కాగా, ఆలయాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఈవీ వాహనాలనే అనుమతించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రణలు ఉండాలని సీఎం పేర్కొన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ, ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. బాసర ఆలయ అభివృద్ధిపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు అధికారులు మిగతా2లో..

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

- ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది
- తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం



చెన్నై,ఏప్రిల్4 : 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ మిగతా2లో..

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

- సీట్లు కోల్పోతామన్న వాదనలో అర్థం లేదు
- కేరళ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



తిరువనంతపురం,ఏప్రిల్4 : జనాభా నియంత్రణతో దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయంటూ చేస్తున్న వాదనల్లో నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. కొందరు కావాలనే ఈ వాదనను తెరపైకి తెచ్చారని అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అధికారంలోకి వస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఎల్డీఎఫ్ ఉద్వాసనకు కౌంట్‌డౌన్ మొదలైందని చెప్పారు. తిరువళ్లలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, కేరళ అభివృద్ధిపై కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఎన్నడూ దృష్టి పెట్టలేదని, 2004-2014 మధ్య కేరళ అభివృద్ధికి అప్పటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం కేటాయించిన మొత్తం కంటే తమ ప్రభుత్వం ఎక్కువ కేటాయించిందని చెప్పారు. 'ఇంతకుముందు కూడా ఇక్కడకు వచ్చాను. కానీ ఈసారి అన్నివైపుల నుంచి మార్పు కోరుతున్న బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో అతిపెద్ద మార్పు రాబోతోంది. తొలిసారి బీజేపీ-ఎన్డీయే ప్రభుత్వం కేరళలో అధికారంలోకి రాబోతోంది' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎల్డీఎఫ్-యూడీఎఫ్ ప్రభుత్వాలు ఎప్పుడూ ఈ ప్రాంతం గురించి పట్టించుకోలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, చాలా ఏళ్లుగా ఒక్క ప్రధాన బ్రిడ్జి కూడా నిర్మించ లేదని, మెడికల్ కాలేజీ పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. కనీస మౌలిక సదుపాయాలు లేకుండా జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో ఉంటాయనేది ఎవరైనా ఊహించవచ్చని అన్నారు. ఎన్డీయే విధానాలతో ప్రతి ఒక్క వర్గానికి, ముఖ్యంగా మహిళలు ఎంతో లబ్ధి పొందుతున్నారని ప్రధాని అన్నారు. వలస కార్మికులకు ఉద్యోగాలు కల్పన కేరళలో అతిపెద్ద సమస్యగా ఉందని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ఇది మోదీ ఇచ్చే హామీ మిగతా2లో..

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహీంపట్నం, క్యాతన్‌పల్లి

- పట్నం చైర్మన్‌గా టేకుల సుదర్శన్ రెడ్డి ఎన్నిక
- క్యాతన్‌పల్లి చైర్‌పర్సన్‌గా గొడిశెల సంధ్యారాణి ఎన్నిక
- రెండుచోట్లా ఎన్నికలకు దూరంగా ఉన్న కాంగ్రెస్


హైదరాబాద్,ఏప్రిల్4 : రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా భాజపా కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీని కూడా గులాబీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్ పదవిని సీపీఐ అభ్యర్థి సరిత దక్కించుకున్నారు. ఈ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. ఎట్టకేలకు ఈ మున్సిపాలిటీని భారత్ రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి టేకుల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ఛైర్‌పర్సన్‌గా బీజేపీ కౌన్సిలర్ ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. మరోవైపు.. ఈ ఎన్నికలో ఉద్రిక్తత పరిస్థితులు మిగతా2లో..



# కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

- రేవంత్ ఆదేశాలతోనే దాడికి వ్యూహం
- తీవ్రంగా ఖండించిన హరీష్ రావు

హైదరాబాద్,ఏప్రిల్4 : ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ గూండాల దాడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఇది ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో జరిగిన దాడి అని, ప్రజాస్వామ్యం పై సీఎం చేయించిన దాడి అని ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ సోయి మరచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరు బీహార్ గ్యాంగ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు.ఏకంగా ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాల పైనే ముప్పేట దాడులు చేస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా మిగతా2లో..



# పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

- అందుకే తనపై సిఐడి విచారణ
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్4 : ఇటీవల హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసు విధులకు భంగం కలిగించడం, రెచ్చగొట్టే మిగతా2లో..

# తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

- కాంగ్రెస్ ఎన్నికల ఫండ్ కోసం రాష్ట్ర సంపద తరలింపు
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఘాటు విమర్శలు



వరంగల్,ఏప్రిల్4 : తెలంగాణ ప్రజల సంపదను రేవంత్ రెడ్డి కొల్లగొడుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపణలు గుప్పించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల మిగతా2లో..

# కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు - కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్4 : క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం పీఠాలు బీఆర్ఎస్ కైవసం కావడం హర్షణీయమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్నారు. అణచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో మిగతా2లో..

## భారీ ఉగ్రకుట్రను భగ్నం చేసిన పోలీసులు

- కుట్రదారులు నలుగురి అరెస్ట్



న్యూఢిల్లీ,ఏప్రిల్4 : దేశంలో భారీ పేలుళ్ల ఉగ్రకుట్రను ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు భగ్నం చేశారు. పేలుళ్లకు ప్రణాళికలు రచించిన నలుగురిని ఉత్తర ప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం(ఏటీఎస్) అరెస్టు చేసింది. నిందితులకు పాక్ ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. నలుగురు నిందితులను సాకిబ్ అలియాస్ డెవిల్, వికాస్ గెహ్లోవత్ అలియాస్ రౌనక్, లోకేశ్ అలియాస్ పాఎ÷-లా పండిట్ అలియాస్ బాబు అలియాస్ సంజు, అర్బాబ్‌గా



# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- బావిలోకి దూసుకెళ్లిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన 9మంది మృతి

ముంబై,ఏప్రిల్4 :మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న 9 మంది మిగతా2లో..

# అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

- చకచకా పనులు సాగి తీరాల్సిందే
- అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం
- అమరావతి చరిత్రలో అందరూ భాగస్వాములే
- నిర్మాణ పనులపై సమీక్షలో సిఎం చంద్రబాబు

అమరావతి,ఏప్రిల్4 : రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు.



కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన మిగతా2లో..

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక



## తెలంగాణ సంపద కొల్లగొడుతున్న రేవంత్

కోసం రాష్ట్ర ప్రజల సంపదను తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆరు గ్యారెంటీలు, ఫీజురీయింబర్స్‌మెంట్ సహా పలు అంశాలపై సీఎంకు ప్రశ్నలు సంధించారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆరు గ్యారంటీలు- 66 హామీల పేరుతో ప్రజలను ఆయన మోసం చేశారని ఎంపీ ఈటల ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజానీకం గంపెడు ఆశలతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే.. చట్ట సభల్లో ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వ్యక్తిగత దూషణలతో కాలం వృథా చేశారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నుంచి ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి సర్కార్ చెలగాటం ఆడుతోందని ఆగ్రహించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు ఎలా సాధ్యమవుతుందని ఎన్నికల వేళ అగినప్పుడు.. తాను చేసి చూపిస్తానని రేవంత్ ప్రగల్భాలు పలికారని చెప్పారు. ఇప్పుడు హామీలు అమలు చేయకుండానే చేసినట్లు చెప్పుకుంటున్నారని విమర్శించారు. వేల కోట్ల విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులతో కలిసి సీఎం రేవంత్ అమ్ముకుంటున్నారంటూ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు.

## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు - కెటిఆర్

తావులేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని ఈ ఫలితాలు చెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## భారీ ఉగ్రకుట్రను భగ్నం చేసిన పోలీసులు

గుర్తించారు. పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరంతా పని చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరంతా దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులు టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పాకిస్థాన్ తీవ్రవాద గ్రూపులతో సంబంధాలు కలిగి ఉన్నట్లు విచారణలో ఏటీఎస్ పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు మీరట్‌కు చెందిన సాకిబ్ అలియాస్ డెవిల్ అని తెలిపారు. మిగిలిన ముగ్గురితో కలిసి దేశంలో అతను పేలుళ్లకు ఎ÷–లాన్ చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ 2న లక్నో రైల్వేస్టేషన్ వద్ద పేలుడుకు కుట్ర పన్నుతుండగా పక్కా సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిపై వివిధ చట్టాల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి పేలుడు పదార్థాలు, ఏడు స్మార్ట్ ఫోన్లు, 24 కరపత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ నిందితులు కొన్ని ప్రదేశాల్లో చిన్నపాటి పేలుళ్లకు పాల్పడ్డారని.. దాన్ని వీడియో తీసి ఉగ్రసంస్థలకు పంపారని పోలీసులు తెలిపారు. దాని ద్వారా ఉగ్రసంస్థల నుంచి నిధులు సేకరించారని పేర్కొన్నారు. వీరంతా సోషల్ మీడియాను ఉపయోగించి యువతను తీవ్రవాదం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారన్నారు. రైల్వే సిగ్నల్స్, గ్యాస్ సిలిండర్ల ట్రక్కులు, ప్రభుత్వ కీలక ఆస్తులే లక్ష్యంగా దాడికి ఎ÷–లాన్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే వీరంతా రాజకీయ ప్రముఖుల ఇళ్లు, ప్రముఖ సంస్థల వద్ద రెక్కీ నిర్వహించారని.. ఆ సమాచారాన్ని పాకిస్థానీ హ్యాండ్లర్లకు పంపారని తెలిపారు. ఘజియాబాద్, అలీగఢ్, లక్నోతోపాటు ప్రముఖ ప్రదేశాల్లో వీరంతా సర్వే చేశారని పోలీసులు పేర్కొన్నారు.

## బాసర మాస్టర్ ప్లాన్‌కు సిఎం రేవంత్ ఓకే

వివరించారు. మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం. ఆలయ అభివృద్ధి అద్భుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, శాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి ఉండాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను, రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఈవీ వాహనాలను మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా నిబంధనలు కఠినతరం చేయాలని ఆదేశించారు. తిరుమల తరహాలో అన్ని ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నిబంధనలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశానికి మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ నెల 6న బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. రూ.225 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

## ఇంటా, బయటా ఎదురైన సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నాం: జైశంకర్

మాట్లాడుతూ, భారత్ ఇతర దేశాలతో పాటు అంతర్గతంగా సవాళ్లు ఎదుర్కొంటోందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్త ఒడిదుడుకుల నుంచి భారత్ దృఢంగా బయటపడిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పులను అంగీకరించడంలో కొన్ని దేశాలు ఇబ్బందిపడుతున్నాయని అన్నారు. ఈ పరిణామాలతో ఆ దేశాల్లో వస్తోన్న మార్పులతో ప్రపంచక్రమం మారుతోందని అన్నారు. సరికొత్త సాంకేతికతలు, సవాళ్లు ఈ పోటీ వాతావరణంలో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడాన్ని ప్రోత్సహించాయని అన్నారు. ఎన్నో దేశాల్లో ఆశావాదం కొరవడిందని, కానీ మన దేశంలో మాత్రం అందుకు భిన్నంగా ఉందని అన్నారు. గత పది సంవత్సరాలుగా ఆశావాద వాతావరణమే కనిపించిందని, రానున్న పదేళ్లు కూడా అలాగే ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో అతిపెద్ద ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఒకటి అని గుర్తు చేశారు. ఇటీవల మన సామర్థ్యాలను పరీక్షించిన ఎన్నో షాక్‌ల నుంచి మనం విజయవంతంగా బయటపడ్డామని అన్నారు.

## కెసిఆర్ క్యాంప్ కార్యాలయంపై దాడి

లేనట్లా?. కాంగ్రెస్ పాలనలో ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, మీడియాపై దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయారా? ఎందుకు అడ్డుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఒకవైపు ' హేట్ స్పీచ్ బిల్ ' పేరుతో ప్రజలు, ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ ప్రజా పాలన? అంటూ నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమని చెబుతూ గూండా రాజ్యం అమలు చేస్తారా? అని అన్నారు . సీఎం, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో పొలిటికల్ టూర్లు చేస్తూ పాలనను గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉంటే, ఇక్కడ పాలనను ఎవరు చూస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని సందేశాలు ఇచ్చారా? కాంగ్రెస్ నాయకులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారు. మీ అణచివేతలకు, నిర్బంధాలకు, దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు, బెదరదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటమని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడులు జరిపిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీకి డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని, తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు.

## పొంగులేటి మైనింగ్ స్కామ్ దృష్టి మళ్లింపు

వాఖ్యలు చేసిన కేసులో.. కౌశిక్ రెడ్డి శనివారం సీఐడీ అధికారుల ఎదుట హాజరయ్యారు. విచారణ అనంతరం ప్రభుత్వం, పోలీసులపై పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని రాజకీయంగా వేధించడానికి ఈ విచారణలు జరుపుతున్నారని ఆరోపించారు. సీఐడీ కార్యాలయం వెలుపల మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ప్రస్తుత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అనని మాటలు అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. పొంగులేటి మైనింగ్ స్కామ్ నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే నాపై ఎథిక్స్ కమిటీ వేశారు. ప్రజల పక్షాన పోరాడటానికి నేను దేనికైనా సిద్ధం. హుజూరాబాద్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. కరీంనగర్ జిల్లా చెత్తనంతా తెచ్చి హుజూరాబాద్‌లో వేస్తే ఊరుకోం. ఆ డంపింగ్ యార్డ్ కరోనా కంటే ప్రమాదం. ఈ విషయంలో నేను చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి విచారణ పేరుతో అడ్డుకుంటున్నారు. ఈ నెల 7వ తేదీన హుజూరాబాద్‌లో దీక్షకు కూర్చుంటా. నేను మత మార్పిడిలపై వ్యాఖ్యలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా' అని అన్నారు.

## సేల్ డిడి ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినవి

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో శాంతి శ్రీమైయి తండ్రి బంగారయ్య అను నేను నా ఒరిజినల్ సర్టిఫికెట్ పత్రాలు మీసేవ కేంద్రానికి జిరాక్స్ నిమిత్తమై వెళు ‿ండగా గుర్తించలేని ప్రదేశంలో పడిపోయాయి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ నెంబర్ సెల్ డిడి డాక్యుమెంట్ నంబర్ 4235/ 2022 దోమకొండలో పోయాయి ప్రజలకు ఎవరికైనా దొరికితే ఈ కింది ఫోన్ నెంబర్ కు సంప్రదించి ఇవ్వగలరని మనవి, ఈ క్రింది 9000 90 5770 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని మనవి వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని కోరుతున్నాము.

# బిఆర్ఎస్ ఖాతాలో ఇబ్రహింపట్నం, క్యాతన్‌పల్లి

నెలకొన్నాయి. ఎన్నికను వాయిదా వేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ 55 రోజులు క్యాంప్ నిర్వహించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ముగ్గురు కౌన్సిలర్లపై కోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నిక నిర్వహించడం సరైనది కాదని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించామని ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. దీంతో ఎన్నికల పక్రియ కొనసాగింది. ఈ ఎన్నికలో భారత్ రాష్ట్ర సమితి తరఫున సుదర్శన్ రెడ్డి ఛైర్మన్ అభ్యర్థిగా పోటీ చేయగా, కాంగ్రెస్ తరఫున ఆకుల యాదగిరి పేరును ప్రతిపాదించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలను చేతులు ఎత్తే విధానంలో నిర్వహించారు. ఎట్టకేలకు బీఆర్ఎస్ ఈ మున్సిపాలిటీని తన ఖాతాలో వేసుకుంది. గతంలో అనేక విధ్వాలుగా గొడవలకు కారణంగా మారిన క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని అధికారిక కాంగ్రెస్ పార్టీ దక్కించుకోలేకపోయింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ కౌన్సిలర్ గొడిశెల సంధ్యారాణి ఎన్నికయ్యారు. సీపీఐ మద్దతుతో ఆమె మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో విజయం సాధించారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్, సీపీఐ పొత్తు పెట్టుకోగా, 22 వార్డులకుగాను 10 వార్డుల్లో బీఆర్ఎస్, 4 వార్డుల్లో సీపీఐ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్–సీపీఐ కూటమికి స్పష్టమైన బలం ఉన్నది. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడు స్థానాల్లోనే గెలిచారు. కానీ, మంత్రి వివేక్, కాంగ్రెస్ నేతల అరాచకాల వల్ల గతంలో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పక్రియ నిలిచిపోయింది. చివరకు కోర్టు ఆదేశాలతో శనివారం క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించారు. తాజాగా నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు కాంగ్రెస్ కౌన్సిలర్లు దూరంగా ఉన్నారు. బీఆర్ఎస్, సీపీఐ నుంచి ఎన్నికైన 14 మంది కౌన్సిలర్లు మాత్రం ఎన్నికకు హాజరయ్యారు. ఇక కోరం ఉండటంతో ఎన్నిక పక్రియను సజావుగా కొనసాగించారు. దీంతో గొడిశెల సంధ్యారాణి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కౌన్సిలర్ మిట్టపల్లి సరిత వైస్ చైర్మన్‌గా గెలుపొందారు.

# అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను

బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టా÷–గ్గ÷ట్‌లు నిర్దేశిరచుకుని పనులు పూర్తి చేయాలని అధికారులు, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్టే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలుగా మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు... కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశిరచిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్టక్చర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరించి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

### మహిరాష్ట్రలో ఘోర ప్రమాదం

అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని మృతుల బంధువులు తెలిపారు. నాసిక్ జిల్లా డిండోరీ తాలూకాలో ఈ ప్రమాదం జరిగింది. శివాజీ నగర్‌లో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా వారిని మృత్యువు కబలించింది. వివరాల్లోకి వెళ్తే.. నాసిక్ జిల్లాలోని డిండోరీ ప్రాంతానికి చెందిన సునీల్ దత్తాత్రేయ దర్గుడే (34).. తన భార్య రేష్మా దర్గుడే (30), కుమార్తె రాఖీ అలియాస్ గుణవతి దర్గుడే, వదిన ఆశా దర్గుడే (32), ఆమె కుమారుడు శ్రేయాస్ దర్గుడే, కుమార్తె శ్రిష్టి దర్గుడేతో కలిసి కారులో శివాజీనగర్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. వేసవి సెలవులు కావడంతో.. ఫంక్షన్ అనంతరం రేష్మా దర్గుడే మేరకోడళ్లు మాధురి, శ్రావణి.. అశా దర్గుడే మేన కోడలు సమృద్ధి కూడా వారితో ఇండోర్ గ్రామానికి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో డిండోరీ తాలూకా కేంద్రంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ బావిలోకి దూసుకెళ్లింది. అది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సాయంతో కారును బయటికి తీశారు. ఆ కారులో 8 మృతదేహాలు ఉన్నాయి. కారు నుంచి బయటపడిన మరో బాలిక మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెతికి వెలికి తీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికిగల కారణాలపౌ ఆరా తీస్తున్నట్లు తెలిపారు. ప్రమాద సమయంలో సునీల్ దత్తాత్రేయ దర్గుడే కారు నడుపుతున్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. కాగా ఈ ప్రమాదంలో మరణించిన ఆరుగురు పిల్లలు 7 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు వారేని తెలిపారు. ఆ ఆరుగురిలో ఒకరు బాలుడు, ఐదుగురు బాలికలు ఉన్నట్లు చెప్పారు.

# సిబిఎస్ఇ త్రిభాషా విధానంపై ఆగ్రహం

భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బతీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాలవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాత్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాత్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు. ÷–రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

### దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

అని ప్రధాని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాలు, గోవా తరహాలోనే కేరళను అభివృద్ధి చేస్తామని అన్నారు. శబరి రైల్వే ప్రాజెక్టు నిలిచిపోవడానికి ఎల్‌డీఎఫ్ కారణమని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని అడ్డంకులూ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మాదిరిగా అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ ఆయన.. పశ్చిమాసియా అంశంపై భయాన్ని సృష్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేరళలో శబరిమల రైల్వే ప్రాజెక్టు కొత్త అవకాశాలను తీసుకురాగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇది శబరిమలకు ప్రత్యక్ష అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని.. స్థానిక వ్యాపారాలకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు. యువతకు కొత్త ఉపాధి మార్గాలను తెరుస్తుందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇలాంటి అడ్డంకులన్నీ తొలగిపోతాయన్నారు.కాగా, కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న ఒకే విడతలో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## అమరావతి పేరుతో ప్రజలపై భారం

**- భారం కాకూడదన్నదే జగన్ ఆలోచన**

**- చంద్రబాబు పదేపదే అబద్దాలతో మోసం**

**- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**

అమరావతి,ఏప్రిల్4 :అమరావతిపై ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు పదేపదే చెప్పిన అబద్దాలే చెబుతున్నారని విమర్శించారు. అమరావతి రాజధాని అంశంపై తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'వికేంద్రీకరణను మూడు ముక్కలాట అని ఎగతాళి చేశారు. ఇన్నాళ్లు అమరావతికి చట్టబద్ధత లేదా? ఇప్పటికే రాష్ట్రంపై చంద్రబాబు మోయలేని భారం మోపారు. అమరావతిని పూనకం వచ్చినట్లు రీస్టార్ట్ చేశారు. రాజధానిని పేకముక్కలతో పోల్చి వెటకారాలాడారు. ప్రజలపై భారంలేని గ్రోత్ ఇంజిన్ కావాలన్నది జగన్ ప్రతిపాదన. రాజధాని గురించి తొలుత ఆలోచన చేసినప్పుడు ప్రభుత్వ భూమి 30వేల ఎకరాలు ఉండాలన్నారు. సామాన్యులకు, మధ్యతరగతి ప్రజలకు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చేవారికి అందుబాటులో ఉండాలన్నది అప్పుడు ఆయన ఆలోచన. దీనికోసం చేసే ప్రయత్నం ప్రభుత్వం మీద బరువు కాకూడదన్నది జగన్ ఆలోచన. దాన్ని దృష్టిలో పెట్టుకునే 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నచోట రాజధాని పెట్టమన్నారు. చంద్రబాబు 2019లో దిగిపోయే నాటికి రాజధాని ప్రాంతంలో దారుణమైన దోపిడీ, అవినీతి జరిగింది' అన్నారు. మా ప్రభుత్వంలో ఆ వ్యవహారాలన్నీ వెలుగులోకి వచ్చాయి. ఏ అవకాశం వచ్చినా దోపిడీ చేయడం అన్నది చంద్రబాబుకు అలవాటు. ఎన్ని విధాల పిండుకుని సంపాదించాలో చంద్రబాబుకు తెలుసు. అవసరంలేని, ఎక్కడాలేని రేట్లు పెట్టి, అందమైన పేర్లతో కాంట్రాక్టులు ఇచ్చి, దోపిడీ చేస్తున్నారు. మోటారు పెట్టి నీటిని తోడినట్టు, ప్రజల సొమ్మును రాజధాని పేరుమీద లాగేస్తున్నారు' అని అన్నారు. ఏపీలో చంద్రబాబు పట్టించుకోని సిటీలు ఎన్నో ఉన్నాయి. పార్లమెంట్ సాక్షిగా రేణుకా చౌదరి కమ్మరావతి అన్నారు. అమరావతిపై కుల ముద్ర వేయబోయారు. రేణుకాచౌదరి వ్యాఖ్యలను టీడీపీ ఎంపీలు ఎందుకు ఖండించలేదు. రేణుకా చౌదరి అన్న మాటలకు నారా లోకేష్ చప్పట్లు కొట్టారు. రాజధాని నిర్మాణ ఖర్చు ప్రజల మీద పడకూడదన్నదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన. రాజధాని ప్రాంతంలో చంద్రబాబు సొంత ఇల్లు కట్టుకోలేదు. వైఎస్ జగన్ ఇల్లు, పార్టీ కేంద్ర కార్యాలయం ఇక్కడే కట్టుకున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. చంద్రబాబు అండ్ కో దోపిడీ కోసమే అమరావతిని వాడుకుంటున్నాని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'మేము అమరావతిపై కులముద్ర వేయలేదు. రూ.2 లక్షల కోట్ల అప్పులతో సాధ్యంకాని అమరావతిపై... సంబరాలు చేయాలని ఇతర ప్రాంతాలకు చెప్పడం అన్యాయం. అమరావతి సంబరాల పిలుపును ప్రజలు తిరస్కరించారు. అధికారులకు, ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోలేదు.మట్టి, నీళ్లు ఇచ్చి నెత్తిమీద చేయిపెట్టారని ప్రధాని మోదీని చంద్రబాబే అన్నారు. అమరావతికి కులం రంగును పులిమింది చంద్రబాబే. అమరావతిలో అవినీతిని మేం ప్రశ్నిస్తున్నాం. నేలమీద నిలబడి ఆలోచించాలని జగన్ సలహా ఇచ్చారు. అది చేయకుండా ఎదురుదాడి చేస్తున్నారు. పార్లమెంటు అధికారాలు, చట్టాల తయారీ మీద చంద్రబాబువి అవగాహనలేని మాటలు. ఇన్నాళ్లు ముఖ్యమంత్రిగా ఆయన ఎలా పనిచేశారో కూడా అర్థం కావడంలేదు' అని చెప్పారు. అమరావతి బాండ్లను తన ఘనతగా చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. 'అప్పట్లో 8 శాతం వడ్డీకి రుణాలు వస్తుంటే, చంద్రబాబు 10.3 శాతం వడ్డీకి తెచ్చారు. దీన్ని కూడా ఘనంగా చెప్పుకోవడానికి సిగ్గుచేటు కాదా? అప్పు భరించేది, చెల్లించాల్సింది ప్రజలే. అమరావతి ప్రజలు కూడా ఈ అప్పులు భారాన్ని మోయాలి. అమరావతి ఇప్పట్లో కాదని చంద్రబాబే చెప్తున్నారు. 2043 అని చెప్తున్నారంటే దాని అర్థం అదే. అప్పటి వరకూ అమరావతి పేరుతో దోపిడీ చేయాలన్నది చంద్రబాబు ఎ÷–లాన్. తన అవినీతిని అందమైన కథల ద్వారా ప్రజలకు కన్విన్స్ చేయాలనుకుంటున్నారు.తన దోపిడీ, అవినీతి కోసమే అమరావతిని చంద్రబాబుగా రాజధానిగా ఎంపిక చేసుకున్నారు. ఎన్ని కాంట్రాక్టులు అయితే, అంత డబ్బు సంపాదించవచ్చన్నది చంద్రబాబు ఆలోచన. చంద్రబాబు అబద్దాలకు ఆణిముత్యం. చంద్రబాబు చెప్తున్నదానికీ, జగన్ చెప్తున్నదానికీ మధ్య వ్యత్యాసాన్ని, నిజానిజాలపై ప్రజలు ఆలోచన చేయాలి. జగన్ చెప్పిన దాంట్లో వాస్తవికతను కనిపిస్తుంది. చంద్రబాబు ప్రణాళికతో అసలు రాజధాని వస్తుందా?' అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇచ్చే నగరం, సజీవనగరంగా, అప్పుల భారం లేని విధంగా, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టుగా అమరావతి ఎప్పుడు మారుతుంది? ఈ తరహా నగరం ఇప్పుడు కాదని చంద్రబాబే చెప్తున్నారు. ప్రభుత్వం చేసే అప్పుల ద్వారా రాజధాని కడితే ప్రభుత్వానికి ట్యాక్సులు వస్తాయని అసంబద్ధమైన వాదనలు చేస్తున్నారు. అప్పుల ద్వారా నిర్మాణాలు, పైగా కంపెనీలకు జీఎస్టీ రాయితీలు. రూపాయి ఖర్చు చేసి, 10 పైసలు ఆదాయాన్ని, ఆదాయం అంటారా? అని అన్నారు. ఆ పది పైసలు కూడా కాంట్రాక్టర్లకు రాయితీలకు పోతుంది. అసలు చంద్రబాబు ఏ ఎకనామిక్స్ చదివాడో అర్థం కావడంలేదు. ఇంతచేసి చంద్రబాబు కట్టేది 7 బిల్డింగులు. అమరావతిలో 99 పైసలకు ఎందుకు భూములు ఇవ్వడంలేదు? అమరావతిలో ప్రభుత్వానికి వచ్చే భూములు ఎప్పుడు అమ్ముతారు? హైదరాబాద్‌లో ఉన్నంత రేటు రావడానికి ఎంత సమయం పడుతుంది? చంద్రబాబువి ప్రజలను మోసం చేసే మాటలే' అని అన్నారు.

# సంపాదకీయం

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఎపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ది సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయడం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్‌లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రమాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ది చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ది చేస్తే రాజధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమిస్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సాధ్యం కాగలదు.

## మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కొరకు సన్నాహక సమావేశం




లింగాల గణపురం ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోనినెల్లుట్ల గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కొరకు సన్నాహక సమావేశం వి.ఓ. కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ హాజరై మాట్లాడడం జరిగింది సర్పంచ్ గారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా కమిటీ వారు మరియు హమాలి మంచిగా పని చేయాలని తెలిపారు, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయుటకు స్థల సమస్య ఉందని మహిళా సంఘం సభ్యులు తెలపగా భవిష్యత్తులో కచ్చితంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయుటకు స్థలం ఇప్పించుట జరుగుతుందని తెలిపారు ఈ సమావేశంలో ఉప సర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, వార్డు సభ్యులు వేల్పుల శోభారాణి, బొజ్జం సునీత, నల్ల అజయ్,పాల కేంద్రం చెర్మన్ దామెర నాగరాజు, సి.సి.శ్రీకాంత్ రెడ్డి, ఆరు గ్రామ సంఘాల అధ్యక్షులు, వీ.ఓ.ఏ.లు, హమాలి సంఘం నాయకులు హాజరయ్యారు

## క్రైస్తవ సోదరులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు

### ఈస్టర్ అంటే అర్థం చనిపోయి తిరిగి లేచి తనలో ఉన్న దైవత్వాన్ని నిరూపించుకున్న రోజు

### వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్.





జూలూరుపాడు ఏప్రిల్ 5 (విజన్ ఆంధ్ర) జూలూరుపాడు మండల క్రైస్తవుల కు మత గురువులకు వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ ఈస్టర్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే ఒక పవిత్ర దినంగా జీసస్ చనిపోయి తిరిగి మూడో రోజు లేచిన ఈ రోజు ను ఈస్టర్ పండగ అని పిలుస్తారు.ఏసు ప్రభు లోకమునకు మనసులు చేసిన పాపముల విమోచన కొరకై లోకానికి వచ్చారు. మనుషులు చేసిన పాప క్షమాపణ కొరకై ఆయన ప్రాణాన్ని బలిగా అర్పించి మూడవరోజు తిరిగి లేచారు. ఆయనలో ఉన్న ప్రేమ దయ కరుణ కటాక్షాలు ప్రతి ఒక్కరి కుటుంబ సభ్యుల పై ఉండి ఏసుక్రీస్తు కాచి కాపాడాలని కోరారు.

## పాల్వంచ జాతీయ రహదారిపై 'మృత్యుకుప్ప'.. అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

పాల్వంచ. ఏప్రిల్ 4.( విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:పాల్వంచ పట్టణంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ ఎదురుగా గల జాతీయ రహదారిపై అధికారుల బాధ్యతారాహిత్యం వాహనదారుల ప్రాణాల మీదకు తెస్తోంది. రోడ్డు మరమ్మత్తుల పేరుతో ప్రధాన రహదారిపై వదిలేసిన డాంబర్ కుప్ప ఇప్పుడు ప్రమాదాలకు పొంచి ఉన్న అపాయంగా మారిందిఅసంపూర్తి పనులతో ప్రమాద ఘంటికలుజాతీయ రహదారి నుండి గొల్లగూడెం వెళ్లే దారి మధ్యలో తాత్కాలిక మరమ్మత్తుల కోసం అధికారులు డాంబర్ మిశ్రమంతో లెవెలింగ్ పనులు చేపట్టారు. అయితే, పని పూర్తయిన తర్వాత మిగిలిన డాంబర్ కుప్పను రోడ్డు పక్కకు తొలగించకుండా, ప్రధాన రహదారిపైనే వదిలేశారు. ఈ రహదారి గుండా నిత్యం పాఠశాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై, సైకిళ్లపై వెళ్తుంటారు. మలుపు వద్ద ఈ కుప్ప ఉండటంతో వేగంగా వచ్చే వాహనదారులు అదుపుతప్పి పడిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు.. ఈ పనులు ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరిగాయా లేక మున్సిపల్ శాఖ చేపట్టిందా అన్నది స్పష్టత లేనప్పటికీ, పని చేసిన కాంట్రాక్టర్లు, పర్యవేక్షించాల్సిన అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం



చేస్తున్నారు. "చిన్నపాటి నిర్లక్ష్యం ఒక కుటుంబానికి కోలుకోలేని నష్టాన్ని మిగులుస్తుంది. కనీస బాధ్యత లేకుండా రోడ్డుపై కుప్పలు వదిలేయడం అధికారుల అశ్రద్ధకు పరాకాష్ఠ." అని స్థానిక వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలకు డిమాండ్.. ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, రహదారిపై ఉన్న డాంబర్ కుప్పను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరగకముందే అధికారులు మేల్కొని ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా పాలన లో అంగన్వాడి పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన రేవంత్ సర్కారు

### అనంతారం సర్పంచ్ కొర్స రమేష్

జూలూరుపాడు ఏప్రిల్ 5( విజన్ ఆంధ్ర ) జూలూరుపాడు మండలం అనంతారం గ్రామం అంగన్వాడి పాఠశాల లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ న 1 నుండి 12 వ తారీకు వరకు. పుట్టిన రోజు నుండి 6 సంవత్సరాల పిల్లల పెరుగుదల పర్యవేక్షణ 14 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వరకు పెద్ద పిల్లలకు చిక్కీస్ అందించడం మరియు గర్భిణీ స్త్రీల కు పోషకాహారం అందించడం వంటి కార్యక్రమాలలో భాగంగా ఏప్రిల్ 4 తేదీ శనివారం రోజు అనంతారం అంగన్వాడి పాఠశాల కి వెళ్లి పర్యవేక్షించి పిల్లలకు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకుని పెద్ద పిల్లలకు




చిక్కీ స్ అందించిన సర్పంచ్ కొర్సా రమేష్ ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంజ రవికుమార్ అంగన్వాడీ టీచర్ సుజాత చిన్నపిల్లలు పెద్ద పిల్లలు గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## మాజీ మేయర్ సంజయ్ అభిమానుల నిరాహార దీక్ష

### నగరంలో ఫ్లెక్సీల కళకళ

నిజామాబాద్ ఏప్రిల్ 04:(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ మాజీ మంత్రి డీఎస్ తనయుడు, నిజామాబాద్ నగర తొలి మేయర్ ధర్మపురి సంజయ్ కు పార్టీలో గుర్తింపు ఇవ్వాలని అభిమానులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు.
ఈ సందర్భంగా ఆయన అభిమానులు మాట్లాడుతూ చురుకుగా పాల్గొంటూ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తున్న డి.సంజయ్ కు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆయన అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి పదవి ఇవ్వాలని వారు కోరారు. ధర్మపురి సంజయ్ ఏ పార్టీలో ఉన్నా తాము ఆయన




వెన్నంటే ఉంటామన్నారు. నిరాహార దీక్షలో సంజయ్ అభిమానులు ఆకుల చిన్న రాజేశ్వర్, ఆమందు వెంకటేష్, కపిల్, పుప్పాల భాజన్న, సక్కి విజయ్, పుప్పాల విజయ, సందీప్, రణధీర్, రింపు, పాల్గొన్నారు.

## విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్






గద్వాల ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)విద్యార్థులు చదువుతోపాటు సామాజిక సేవ కార్యక్రమాల్లోనూ భాగస్వాములు అయ్యేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు బిఎస్ జీ, ఎన్ సీ సీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో వారిలో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి అవకాశం ఉందన్నారు. అలాగే సామాజిక సమస్యలపై అవగాహన కలగడమే కాక వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. బి ఎస్ జి విద్యార్థులకు వారి శిక్షణ అనంతరం ఇచ్చే సర్టిఫికెట్ భవిష్యత్తులో వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా పోలీసు శాఖలో రాణించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఈ శిక్షణ పొందేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎక్కువగా అవకాశం ఉంటుందని, జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వివిధ కళలపై, ఇతర అంశాలపై నైపుణ్యాలు పెరిగేందుకు శిక్షణ తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ కు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలుకుతూ స్కార్ఫును, బాడ్జిని అందజేశారు. అలాగే జ్యోతి ప్రజ్వలన చేసి, భారతమాత చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్కౌట్స్ విద్యార్థులు పరేడ్ నిర్వహించగా అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన వివిధ స్కిట్ ప్రదర్శనలు, స్వాగత నృత్యం ఆకట్టుకుంది. చివరగా అతిథులు విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో డిఇఓ విజయలక్ష్మి, బి ఎస్ జి రాష్ట్ర కోశాధికారి రాజగోపాల్, రాష్ట్ర శిక్షకులు అమర జ్యోతి, రవి కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, స్కౌట్ మాస్టర్లు కృష్ణ కుమార్, ప్రశాంత్ కుమార్, గైడ్ కెప్టెన్లు డా. యాసిం బీ, కవిత, పలువురు విశ్రాంత అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తాను ఇటీవల జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు వివిధ సమస్యలను గుర్తించానన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పాత ఫైల్స్ క్లియరెన్స్, పనికిరాని ఫర్నిచర్ తొలగించాలని ఆదేశించినప్పటికీ చాలాచోట్ల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత మెడికల్ అధికారులు బాధ్యతాయుతంగా లేకుంటే తమ కిందిస్థాయి సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, లీవ్ లెటర్ రాయకుండా విధులకు గైర్హాజరైతే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని పీహెచ్ సీలు, ఇతర ప్రభుత్వ ఆసుపత్రిల్లో బయోమెట్రిక్ విధానంలో హాజరు తప్పనిసరి చేయాలని, యంత్రాల్లో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకుని వినియోగించాలన్నారు. ఆయా ఆసుపత్రుల్లోని వివిధ రిజిస్టర్ల నిర్వహణ, వ్యాక్సినేషన్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయా ఆసపత్రుల వైద్యాధికారులు తమ సమీపంలోని సబ్ సెంటర్స్ కు, ఇతర క్యాంపులకు వెళ్లినప్పుడు ముందుగానే సంబంధిత రిజిస్టర్లో పేర్కొన్నాలన్నారు. ఎన్సిడి స్క్రీనింగ్ తో పాటు ఇతర కార్యక్రమాలన్నీ వంద శాతం విజయవంతం చేసేలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరగాల్సి ఉందన్నారు.




జోగులాంబ గద్వాల జిల్లా నుంచి వైద్య సేవలకు చాలామంది రోగులు కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం ఏముందని, జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఏరియా ఆసుపత్రులతో పాటు సబ్ సెంటర్స్ సాయి వరకు ప్రతి 15 రోజులకోసారి వైద్యాధికారులు తమ సిబ్బందితో సమన్వయ సమావేశాలు నిర్వహించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. వైద్యాధికారులు, డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల ఆరవ తేదీ నుంచి 11వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల గురించి డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని వైద్య కేంద్రాల డాక్టర్లు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేరేడ్ మెట్, మల్కాజిగిరిలో రన్ ఫర్ జీసస్

మల్కాజిగిరి, ఏప్రిల్ 4,(విజన్ ఆంధ్ర): నేరేడ్ మెట్ చౌరస్తా నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో మల్కాజిగిరి వరకు ఉన్న చర్చి పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ క్రైస్తవ గాయకు లు గొంగల సునీల్,మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ జనరల్ సెక్రెటరీ సంజీవ్ రావు, బి బ్లాక్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్,సంతోష్ కుమార్, జీఎన్ వీ సతీష్ కుమార్, పాస్టర్ పీ. జాన్ పాల్,పాస్టర్ రాజు,పాస్టర్ శ్రీనివాస్,పాస్టర్ బాబు రావు,పాస్టర్ ఆనంద్, అరుణ్ కుమార్, ఇస్సాకు,



సత్తయ్య,దేవదానం, యేనా, రాము,దాస్,సంజీవ్, సిద్దు, పాల్గొన్నారు

## పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది

నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలు అందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవం, మర్యాదలు మరింత పెరుగుతాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నర్వ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ గా విధులు నిర్వర్తిస్తున్న మన్యం ఎస్ ఐ పదోన్నతి పొందారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ తన చేతుల మీదుగా పదోన్నతి పొందిన మన్యం కి రెండు స్టార్లు అలంకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన మన్యం కి తాత్కాలికంగా రూరల్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయడం జరిగింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం ఉత్సాహానికే కాదు, మరింత బాధ్యతను కూడా తీసుకువస్తుందని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా, నమ్మకం కలిగించే విధంగా పని చేయాలని, ముఖ్యంగా నిరుపేద ప్రజలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు

## గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ ఉద్యోగులను వెట్టి చాకిరీ నుండి విముక్తి చేయాలి

### తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్..

నారాయణపేట ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) నారాయణపేట్ జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ ఉద్యోగులను వివిధ కార్యక్రమాల పేరుతో వెట్టి చాకిరీ చేయించడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ఈ ఉద్యోగులను పిలిపించి, వారి విధులకు సంబంధం లేని పనులు చేయించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం జరుగుతున్న బావోజీ జాతర సందర్భంలో కూడా వివిధ గ్రామ పంచాయతీల నుండి ఉద్యోగులను తీసుకువచ్చి వెట్టి చాకిరీ చేయించడం దురదృష్టకరమని అన్నారు.మల్టీ పర్పస్ ఉద్యోగులు అమాయకులై, తమ హక్కుల గురించి మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారని, ఈ పరిస్థితిని అధికారులు దుర్వినియోగం చేయకూడదని సూచించారు.అందువల్ల జిల్లా కలెక్టర్ మరియు డీపీవో వెంటనే స్పందించి, గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ ఉద్యోగులను వెట్టి చాకిరీ నుండి విముక్తి చేసి, వారి విధులకు సంబంధం లేని పనులకు వినియోగించకూడదని విజ్ఞప్తి చేశారు.


## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి

### ఇంటింటికి కరపత్రాలు పంపిణీ



మక్తల్ , ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో ఈనెల 6న జరగనున్న హిందూ సమ్మేళనం లో హిందూ బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మక్తల్ మున్సిపల్ బిజెపి ఫ్లోర్ లీడర్ బి.రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హిందూ సమ్మేళనం లో భాగంగా శనివారం మక్తల్ పట్టణం లో గల 1వ వార్డ్ , 11 వ వార్డు లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా దేశమంతటా హిందూ సమ్మేళనం కొనసాగుతున్న నేపథ్యంలో మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గల రామ్ లీలా మైదానంలో ఈనెల 6న సాయంత్రం 6 గంటలకు సమ్మేళనం సభ ఉంటుందని అన్నారు.హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని హిందూ సంఘటిత శక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.జె.పి నాయకులు విద్యా సాగర్,రాఖేష్, కుర్వ మహాదేవ్, శ్రీధర్, శ్రీను, వినోద్, బి. బాల్ రెడ్డి, బి. రవీందర్ రెడ్డి, శివానంద్ రెడ్డి,హీరా లాల్ తదితరులు పాల్గొన్నారు.

## గురులోక్ మాసంధ్ ప్రభు (బావోజీ)ని దర్శించుకున్న జిల్లా కలెక్టర్



నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లి లో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) జాతర బ్రహ్మోత్సవాలకు శనివారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ అధికారి/ఆర్డీవో రామచందర్ నాయక్, ఆలయ కమిటీ సభ్యులు కలెక్టర్ కు గౌరవ పూర్వక స్వాగతం పలికారు. అనంతరం గురు లోక్ మాసంద్ ప్రభును, పక్కనే ఉన్న కాళికా దేవి మాత ను కలెక్టర్ దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కమిటీ సభ్యులు కలెక్టర్ ను ఆర్డీవో ను సన్మానించారు. కాగా జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు జాతర ఉత్సవాలు ముగుస్తాయనీ, అధికారులంతా జాతర ముగిసే వరకు దగ్గరుండి పర్యవేక్షణ చేయాలని సూచించారు. అలాగే భక్తులందరూ తిరిగి వారి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ట్రాఫిక్ సమస్య లేకుండా వాహన రాకపోకలను సజావుగా కొనసాగించాలని, జాతర ముగిసే వరకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని కలెక్టర్ పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మొగులప్ప, డిపివో సుధాకర్ రెడ్డి, డీపీఆర్ వో రషీద్, తహశీల్దార్ జయరాములు, మద్దూరు, కొత్తపల్లి ఎంపీడీవోలు, సీఐ సైదులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఖమ్మం, ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)రైతులు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి మార్కెట్ లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ చైర్మన్ పోకబత్తిని అనితతో కలిసి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జాతర నుంచి వస్తూ విషాదం

### బైక్ ప్రమాదంలో యువకుడు మృతి

రాయికల్, ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర): జగిత్యాల రూరల్ మండలం లింగంపేట గ్రామానికి చెందిన సిరికొండ చంద్రశేఖర్(25) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.మండలంలోని తాట్లావాయి గ్రామజాతర నుంచి తిరుగు ప్రయాణంలో సింగారావుపేట శివారులో అతివేగంగా బైక్ నడుపుతూ చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై మృతుడి తల్లి సిరికొండ గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

## నేత్రపర్వంగా సాగిన " దేవి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ" కళాకారుల నృత్య ప్రదర్శనలు



హైదరాబాద్ ఏప్రిల్ 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ప్రఖ్యాత వాగ్గేయకారుడు, సద్గురు త్యాగరాజ స్వామి 179వ దివ్య ఆరాధనా మహా మహోత్సవాలలో భాగంగా సాంస్కృతిక సంస్థ "సరస్వతి స్వర శిక్షణాలయం"వ్యవస్థాపకురాలు కర్ణాటక సంగీత గురువు 'సరస్వతి' నిర్వహించిన త్యాగరాజ స్వామి ఉత్సవాలలో భాగంగా సంగీత, నృత్య ప్రదర్శనల కార్యక్రమం శ్రవణానందకరంగా నేత్రపర్వంగా సాగింది. బుధవారం సాయంత్రం రవీంద్రభారతిలో మెయిన్ హాల్, సైఫాబాద్ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన "ఎందరో మహానుభావులు అందరికీ వందనములు" పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూచిపూడి, భరతనాట్య నృత్య కళాకారుల నాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి ,ఆకట్టుకున్నాయి. నేత్రపర్వంగా సాగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నృత్య శిక్షణాలయం " దేవి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ" బండ్లగూడ జాగీర్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రముఖ నృత్య కళాకారిణి 'శరణ్య కాసా' నేతృత్వంలో ప్రదర్శించిన నృత్యోత్సవంలో అకాడమీలో నృత్య శిక్షణ నేర్చుకుంటున్న 19 విద్యార్థులతో కలసి అద్భుతంగా నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను మెప్పించిన సమూహ నృత్యాలు, ఏకల నృత్యాలతో అందరి ప్రశంసలను అందుకున్నాయి. సమూహ నృత్యాలలో విద్యార్థులు 'రామ శబ్దం' రూపకంలో శ్రినికా రెడ్డి, శ్రీహిత, హేతిక, మేధా నర్ తించగా ' పుష్పాంజలి' ని కీషా, సితారా, ఆదిత్రి ప్రదర్శించారు. ' పలుకే బంగారు మాయెనా' నృత్యంశలో యశ్వి, ధన్విక, గీత, రోహిత, నవిషా నర్తించారు. అనంతరం 'పాహి రామ ప్రభో ' రూపకం లో మనస్వి, అయాతి, భావనా, ఇషాన్వి, సాయి శ్రీ, దివ్య నేత్రపర్వంగా నర్తించారు. ఏకల నృత్యాలను గీతాన్విత అంబా పరాఖ్అన్విత అదేనమ్మ , గురువుశరణ్య కాసా ఆనంద తాండవ మాడే కూచిపూడి ముత్యాంశాలను నయనానందకరంగా అద్భుతంగా ప్రదర్శించి అందరి హృదయాలను దోచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రసమయి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం. కె. రాము, ప్రత్యేక తిథిగా రిటైర్డ్ జడ్జి నేరెళ్ల మాల్యాద్రి, గౌరవ అతిథిగా నృత్య గురువు నిశ్చలసుధామల, ఆత్మీయ అతిథిగా కర్ణాటక సంగీత విద్వాన్సురాలు డాక్టర్ మంగళంపల్లి స్వర్ణ హాజరై అద్భుతంగా ప్రదర్శించి అలరించిన కళాకారులను, గురువులను అభినందించారు. కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ సంగీత, నృత్య ఉత్సవంలో తామను కూడా భాగస్వామ్యులను చేసినందుకు ఆనందిస్తున్నామని తమ శుభాభినందనలను అందజేశారు. అలరించిన కళాకారులను, గురువు శరణ్య కాసాను ప్రశంశించి మొమెంటోలను ప్రధానం చేసి ఆశీర్వదించారు.

## క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



హొవనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లాలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను, యువతను ప్రోత్సహించి క్రీడలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేన రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి పెబ్బేరు మున్సిపాలిటీలో పర్యటించారు. స్థానికంగా ఉన్న పిజెపి క్యాంప్ ఆవరణలోని ఖేలో ఇండియా ఫుట్బాల్ మైదానాన్ని పరిశీలించారు. మైదానంలో క్రీడాకారుల సౌకర్యార్థం కలెక్టర్ సొంత నిధులతో ఏర్పాటు చేయించిన హైమాస్ట్ లైటింగ్ సౌకర్యాన్ని జిల్లా కలెక్టర్ తో కలిసి శివసేన రెడ్డి పరిశీలించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ చూపిస్తున్న శ్రద్ధను అభినందించారు.అనంతరం శివసేనారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి కలెక్టర్ ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా జర్మన్ టెక్నాలజీ తో వనపర్తి జిల్లా పెబ్బేరులో ఒకే స్థలంలో ఫుట్బాల్, హాకీ టర్ఫ్ తోపాటు 400 ట్రాక్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం పిజేపీ క్యాంపు ఆవరణలోని మున్సిపాలిటీ కి చెందిన పది ఎకరాల అనువైన స్థలాన్ని క్రీడా ప్రాధికార సంస్థ పేరున ట్రాన్స్ఫర్ చేస్తూ తీర్మానిస్తే, రూ. 2.50 కోట్లతో మైదానం ఏర్పాటు చేసేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరు పది ఎకరాల స్థలాన్ని వెంటనే సర్వే చేసి హద్దులు గుర్తించి సదరు స్థలాన్ని క్రీడలకు కేటాయించేందుకు మున్సిపాలిటీ ద్వారా తీర్మానం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ కు, మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా త్వరలోనే కేలో ఇండియా ఫుట్బాల్ మైదానంలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైటింగ్ సౌకర్యాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటిని పరిశీలించిన కలెక్టర్పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గృహ నిర్మాణాన్ని సందర్శించిన కలెక్టర్, లబ్ధిదారుతో మాట్లాడి నిర్మాణ పురోగతి, చెల్లింపుల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.లబ్ధిదారులకు ప్రభుత్వంచే అందాల్సిన చెల్లింపులు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పనుల పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు సమాచారం ఇస్తూ, మున్సిపాలిటీ లో మొత్తం 143 ఇళ్లలో 83 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ఇళ్ల పనులను కూడా త్వరితగతిన ప్రారంభించి, లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పెబ్బేరు మునిసిపల్ ఛైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, కృష్ణ కుమార్ రెడ్డి, డివైఎస్ వో సుధీర్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

## బీఎల్ఏల నియామకం అత్యంత కీలకం

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రాజకీయ పార్టీలు వెంటనే జాబితా అందజేయాలి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష



హొహొవనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యంత కీలకమని, కాబట్టి రాజకీయ పార్టీల నుంచి బీఎల్ఏల జాబితా వీలైనంత త్వరగా సేకరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి, సంబంధిత అధికారులతో కలిసి వీసిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు బిఎల్ఎ లను నియామకం చేసుకొని వారి జాబితా సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తి చేశారా అని జిల్లా కలెక్టర్లను ఆరా తీశారు. బిఎల్ఓ లకు ఐడి కార్డుల పంపిణీ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఇక ఎస్ ఐ ఆర్ లో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను కూడా వేగవంతం చేసి పూర్తిచేయాలని కలెక్టర్లకు ఆదేశించారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచన మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ప్రారంభించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం అత్యంత కీలకమని, కాబట్టి రాజకీయ పార్టీల నుంచి బీఎల్ఏల జాబితా వీలైనంత త్వరగా సేకరించాలని ఆదేశించారు. దాంతోపాటుగా ఫారం 6,7,8 కి సంబంధించి ఏవైనా పెండింగ్ దరఖాస్తులు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను సైతం వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో డి సెక్షన్ సూపర్డెంట్ మదన్, వనపర్తి తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ స్కూల్లో జరిగిన దారుణ ఘటన పై నీచ రాజకీయాలకు పాల్పడుతున్న టిఆర్ఎస్ నాయకులు

### -కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్.సలీం



నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) నారాయణపేట పట్టణంలోని ప్రభుత్వమైనార్టీ రెసిడెన్సియల్ పాఠశాలలో గత నాలుగు రోజుల క్రితం ఒక విద్యార్థిపై జరిగిన దారుణ ఘటనపై నిన్న (శుక్రవారం) బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని నారాయణపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్. సలీం శనివారం ఒక ప్రకటన లో విమర్శించారు.జరిగిన దారుణ ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా కండిస్తున్నామని, అలాగే బాధ్యుడైనా టీచర్ పై ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని,ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ కూడా చేశారని,కానీ బి.ఆర్.ఎస్ నాయకులు ఈ ఘటనను ఆసరాగా చేసుకొని రాజకీయ ఉనికిని చాటలానే ప్రయత్నం చేస్తున్నారన్నారు.బిఆర్ఎస్ నాయకులు విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ,వారికినిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ బాధిత విద్యార్థికి అవసరమైన వైద్య సహాయం అందించి, కుటుంబానికి అండగా నిలబడాల్సిన బాధ్యత వారిపై ఉ ందన్నారు.కానీ అలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం కెమెరాల ముందే బాధిత విద్యార్థి కి అయిన గాయలను ప్రదర్శన చేసి,కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆధారరహిత విమర్శలు చేయడం పూర్తిగా రాజకీయ నాటకమేనని విమర్శించారు. ప్రజలు తిరస్కరించిన కూడా బి.ఆర్.ఎస్ నాయకుల్లో ఇంకా మార్పు రావడం లేదని,కాలం చెల్లిన నాయకులతో కలిసి మీడియా దృష్టి ఆకర్షించే ప్రయత్నాలు చేయడం చూస్తుంటే, బాధితుడికి న్యాయం చేయాలనే ఉద్దేశం కంటే ఈ ఘటనను వారి రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవాలనే లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విమర్శలు చేయడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ గురుకుల పాఠశాలల విస్తరణ, నాణ్యమైన విద్య అందించడం,ముస్లిం విద్యార్థులకు స్కాలర్షిప్లు , ఫీజు రీయింబర్స్మెంట్ బలోపేతం, విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం పెంపు, మైనారిటీ వెల్ఫేర్ శాఖ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు,పేద ముస్లిం కుటుంబాలకు ఉపాధి , స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి కూడా నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ల అభ్యున్నతికి కృషి చేస్తూ,వారికి విద్యా,వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ న్నారని,అదేవిధంగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో అసలు సమస్యను పక్కన పెట్టి ప్రభుత్వం పై రాజకీయ విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆయన స్పష్టం చేశారు.బాధితుడి కన్నీళ్లను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే బిఆర్ఎస్ నాయకులకు వారి రాజకీయ కాలం చెల్లిపోయిందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని,సమయం వచ్చినప్పుడు గట్టి తీర్పు ఇస్తారని మహమ్మద్ సలీం హెచ్చరించారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ తప్పనిసరి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి, (విజన్ ఆంధ్ర ప్రతినిధి):ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.హొశనివారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని నాగవరం శివారులో ఉన్న బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్లో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులు అవునని సమాధానం ఇవ్వడంతో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కాంపౌండ్ వాల్ లేకపోవడం సహా, పావురాలతో హాస్టల్ భవనంలో ఇబ్బందులు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ విద్యార్థులు అడిగిన సమస్యలపై ఫైల్ పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. హాస్టల్లో కిచెన్ ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని వార్డెన్ కు సూచించారు. విద్యార్థులకు భోజనం వండేందుకు కావాల్సిన గ్యాస్ సిలిండర్ సౌకర్యం ఉందా అని ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ బీసీ సంక్షేమ శాఖ అధికారి ఆంజనేయులు, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



ఊట్కూర్, ఏప్రిల్ 4 ( విజన్ ఆంధ్ర) గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కొత్తపల్లి సర్పంచ్ ఆర్. నర్సిములు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు బాలింతలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణీలు, కిశోర బాలికలు బాలింతలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న సరుకులు తీసుకువెళ్లాలన్నారు. గర్భిణీ మహిళలుఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు పుట్టబోయే బిడ్డ బలంగా జన్మిస్తారని అన్నారు. బాలింతలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల తల్లిపాలు పుష్కలంగా రావడంతోపాటు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని సంపూర్ణంగా అందజేస్తుందన్నారు. కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అక్షర జ్ఞానంతో పాటు ఆటపాటలు నేర్పించాలని అన్నారు. కేంద్రాల ద్వారా పంపిణీ చేసే సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అంగన్వాడీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత, అంగన్వాడీ టీచర్ ఇందిరా, గ్రామస్తులుహన్మంతు రాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజిన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా : కాంగ్రెస్ సర్కార్ పాలనలో నిత్యం ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లోని గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ జరిగిన ఘటనలు చాలా జరిగాయని తెలిసిందే. తాజాగా ఓ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు విద్యార్థులతోపాటు ఓ ఉపాధ్యాయుడు అస్వస్థతకు లోనయ్యారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్పేట్ మండలం ఎల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయి జన్ బారిన పడి ఆరుగురు విద్యార్థులు, ఉపాధ్యాయుడు అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలు అయ్యాయి. దీంతో విద్యార్థులతోపాటు, ఉపాధ్యా యుడిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కన్న తల్లి జ్ఞాపకార్థంగా చలివేంద్రం ఏర్పాటు చేయడం అవినీతినియం..



సూర్యాపేట ఏప్రిల్ 04:(విజన్ ఆంధ్ర)ప్రజా సౌకర్యార్థం ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల తహసిల్దార్ అమిన్ సింగ్ అన్నారు. మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడి నరసమ్మ జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దహార్తిని తీర్చేందుకు తన తల్లి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. చలివేంద్రాన్ని కార్యాలయానికి వచ్చే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడి ఫౌండేషన్ చైర్మన్ మేడి కృష్ణ, ఎంపీడీవో హసీం, ఎస్సై శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత భూపతి రాములు, ఏపీవో రాము జంగం జానయ్య , మేడి ముత్తయ్య,మేడి లింగయ్య, మేడి నాగయ్య, పద్మ, సునీత, అలివేల, ములకలపల్లి వెంకన్న, బచ్చులకూరి నవీన్, రమేష్, మొలకలపల్లి విష్ణు, చరణ్ తదితరులు ఉన్నారు.

## సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు




ఖమ్మం ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)గత సంవత్సర కాలంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన అమ్మడి పూడి పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమ్మడి పూడి పద్మ మాట్లాడుతూ... తన తండ్రి అమ్మడి పూడి సత్యం కు మొదటి భార్య మంగమ్మకు ఐదుగురు సంతానమని , రెండో భార్య భాగ్యమ్మకు ఒక కుమారుడు జన్మించాడని, తన తండ్రి తో పాటు ఇద్దరు భార్యలు కూడా మృతి చెంది చాలా కాలం అవుతుందని తెలిపారు. ఇద్దరు భార్యలకు కలిగిన సంతానానికి ఉమ్మడిగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం కామేపల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంలో గత సంవత్సరం క్రితం ఫ్యామిలీ నెంబర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయడం జరిగిందని తెలిపారు. సర్టిఫికెట్ కోసం తహసిల్దార్ ను కలిస్తే ఆర్ ఐ ని కలవమని, ఆర్ ఐ ని కలిస్తే వీఆర్వో ను కలవమని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కుటుంబ సభ్యులు కలిసి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసిన సకాలంలో సర్టిఫికెట్ ఇవ్వకుండా చెప్పులు అరిగేలా తిరిగిన సర్టిఫికెట్ ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొనే హక్కు తమకు ఉందని, కానీ కామేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో అధికారుల తీరు అభ్యంతరకరంగా, అనాలోచిత చర్యగా ఉందని, జిల్లాలో బహుశా రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా కేవలం కామేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలోనే ఇటువంటి వింత ప్రవర్తన కలిగి ఉండటం విచారకరమని మండిపడ్డారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని తక్షణమే తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటన మరెవరికి రాకూడదని వేడుకున్నారు. జిల్లా కలెక్టర్, ఆర్ డి ఓ ఇతర ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని తమకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

### మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవములో ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్



భూపాలపల్లి జిల్లా (గణపురం) 04 ఏప్రిల్ (విజన్ ఆంధ్ర) భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండల కేంద్రంలోని కొత్తపల్లి మార్కెట్ యార్డులో మరియు భూపాలపల్లి రూరల్ మండలం గొర్లవేడు గ్రామంలో మార్క్ఫెడ్ సౌజన్యంతో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని పంటను విక్రయించాలని,రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. మొక్కజొన్నకు క్వింటాలుకు కనీస మద్దతు ధరగా రూ. 2,400 చెల్లిస్తూ రైతులకు చెల్లింపులు తక్షణమే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు నిరంతరం కొనసాగించాలని మార్కెట్ యార్డులో తార్పాలింగ్ కవర్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల సంబంధిత అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుతోజ్ .కిష్టయ్య , స్థానిక ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలు: కేటీఆర్

హైదరాబాద్,ఏప్రిల్4 : క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం పీఠాలు బీఆర్ఎస్ కైవసం కావడం హర్షణీయమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అధికార కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ఆ స్థానాలను బీఆర్ఎస్ దక్కించుకుందన్నారు. అణచివేత, అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్రంలో తావులేదని ఈ తీర్పు స్పష్టం చేసింది. కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో కౌంట్‌డౌన్ మొదలైందని ఈ ఫలితాలు చెప్పాయి. మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట ప్రతినిధి ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న నేపథ్యంలో, కొంతమంది యువత తక్కువ సమయంలో, సులువుగా డబ్బులు సంపాదించాలని ఆశించి క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి బెట్టింగ్స్ వల్ల యువత ఆర్థికంగా నష్టపోయి, జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం కూడా ఉందని, దీంతో కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్స్ చట్టరీత్యా నేరమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. అలాగే బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఈ మాయలో పడకుండా జాగ్రత్తపడాలని, తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని ఎస్పీ సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచి, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో పిల్లల్లో ఏవైనా అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రికెట్ వంటి ఆటలను వినోదంగా మాత్రమే చూడాలని, వాటిని బెట్టింగ్‌ల కోసం ఉపయోగించకూడదని అన్నారు.



క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## 32 లక్షల నిధులతో గ్రామ అభివృద్ధి పనులు

### 10 లక్షలు సిసి రోడ్లు, 10 లక్షలు డ్వాక్రా భవనం, 12 లక్షలు జిపి బిల్డింగ్ నిర్మాణం
### ఒక లక్ష 13 వేల 892 రూపాయలు మొత్తం ఆస్తి పన్ను వసూలు
### గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం
### గోధంగూడ గ్రామ సర్పంచ్ నస్కంటి స్వర్ణలత మహిపాల్ రెడ్డి

వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 04 ( విజన్ ఆంధ్ర ) : గ్రామ అంతర్గత రహదారి వ్యవస్థ సవ్యంగా ఉంటే రాకపోకలు సక్రమంగా కొనసాగుతాయని గోధంగూడ గ్రామ సర్పంచ్ నస్కంటి స్వర్ణలత మహిపాల్ రెడ్డి అన్నారు. 32 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో సిసి రోడ్లు, డ్వాక్రా భవనం, జిపి భవనం నిర్మాణం పనులు చేపట్టామని ఆమె స్పష్టం చేశారు. శనివారం వికారాబాద్ మండల పరిధిలోగల గోధం గూడ గ్రామ సర్పంచ్ విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అంబేద్కర్ విగ్రహం నుండి మస్జిద్ వరకు సుమారు 240 మీటర్లు సీసీ



రోడ్డు. నిర్మాణం పూర్తి చేశామని ఆమె తెలిపారు. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో డ్వాక్రాభవనం నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని ఆమె స్పష్టం చేశారు. 12 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామపంచాయతీ భవన నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వివరించారు. ఒక లక్ష 13 వేల 892 రూపాయలు మొత్తం ఆస్తి పన్ను 100% వసూలు చేశామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి పథకంలో భాగంగా ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగుతున్నాయని ఆమె చెప్పారు. సాయి డ్రైనేజీల మరమ్మలు పశువుల నీటి తొట్టిల దగ్గర పైపులు వేసి మరమ్మతులు పూర్తి చేస్తున్నామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయిని మంజుల గ్రామ పంచయతీ కార్యదర్శి పగిడాల స్వాతి క్షేత్రపాలకుడు కొండలి నరసింహులు గ్రామస్తుడు జంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిని అమ్మి , ఇవ్వనంటూ ఎదురు తిరిగిన భూస్వామి

### మాకు న్యాయం చేసి మా భూమి మాకు ఇప్పించండి అంటూ కలెక్టర్కు ఫిర్యాదు

భూపాలపల్లి జిల్లా 04 ఏప్రిల్ (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి మండలం కొత్తపల్లి ఎస్ఎం గ్రామంలో 1995లో సర్వే నెంబర్ 21/అ /4/13 లో భూమిని కొనుగోలు చేసిన మాకు న్యాయం చేసి మా భూమిని మాకు ఇప్పించాలని బాధితులు పేర్కొన్నారు. 1995 సంవత్సరంలో కొత్తపల్లి ఎస్ఎం గ్రామానికి చెందిన బలుగూరి చంద్రావు వ్యవసాయ భూమి 25 మంది రైతులు తలా కొంత కొనుగోలు చేశారు. అట్టి భూమిని కొంతమంది సాదాభాయి నామాలు రెగ్యులర్ చేసుకోవడం జరిగింది పట్టా చేసుకోవడం కోసం చాలా రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఈ క్రమంలో అట్టి భూమిపై తాము వెళితే తమ హద్దురాలను చెదరగొట్టడం జరిగిందన్నారు. దీంతో 25 మంది రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆర్డీవో హరికృష్ణ తాసిల్దార్ శ్రీనివాసులను కలిసి ప్రత్యేకంగా రాతపూర్వకంగా అందజేశారు. ఈ విషయంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు అలాగే చేయాలని రెవెన్యూ అధికారులకు సర్వే చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో శనివారం రైతులతో కలిసి సంబంధిత భూమిలో పరిశీలన చేయడం జరిగిందన్నారు. అంతేకాక తాము 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమిని పట్టాదారు కావాలని ఇబ్బందుల గురిచేయడం అన్యాయమని అన్నారు. దీనిపై తగు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని



కోరుతున్నాం. ఈ విషయంపై అధికారులు వెంటనే చొరవచూపి చంద్రావు నుండి మాకు పట్టా చేయించాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో భూమి కొనుగోలు చేసిన రైతులు రైతులు గొర్రె సుధాకర్ రెడ్డి, ముత్యాల సుదయ్య, సరాస్వతి, స్వామి, రత్తయ్య, సారంగపాణి, తిరుపతి ప్రశాంత్ స్వామి రవి పద్మ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## భీమ్ దీక్ష ఆరోగ్య జాతరను విజయవంతం చేయండి




సూర్యాపేట ఏప్రిల్ 04:(విజన్ ఆంధ్ర)నేడు సూర్యాపేట జిల్లా కేంద్రంలో స్వేరో నెట్వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించే భీమ్ దీక్ష ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్వేరో నెట్వర్క్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొల్లికొండ వీరస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ చరిత్రలో ప్రజా సంక్షేమానికై డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశించిన మార్గంలో పయనిస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడతామన్నారు. భీమ్ దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య జాతరను విజయవంతం చేయడం ద్వారా ప్రజల్లో అక్షరం, ఆరోగ్యం, ఆర్థిక చైతన్యాన్ని పెంపొందించడం, మరియు అంబేద్కరిజం స్ఫూర్తితో సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్ (రిటైర్డ్) ముఖ్య అతిథులుగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి స్వేరో నెట్వర్క్ చీఫ్ కన్వీనర్ బల్గురి దుర్గయ్య, వైస్ చైర్మన్ బాల ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు చిలక బత్తినీ వీరయ్య, జనరల్ సెక్రెటరీ దారమల్ల ప్రకాష్, హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్వేరో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ నరసయ్య,జిల్లా నాయకులు దానరి శ్రీను, మాతంగి రాములు,కొండగడుపుల ఎల్లయ్య, చెరుకుపల్లి లక్ష్మణ్, బొడ్డు వెంకట్,పెరిక పద్మ, పెరుమాళ్ళ సునీత,చింతకుంట్ల కనక మహాలక్ష్మి, బత్తిని సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ మున్సిపల్ ఎన్నిక వాయిదా

### చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం
### ఎన్నిక సందర్భంగా జోగురామన్న హౌజ్ అరెస్ట్

నిర్మల్, ఏప్రిల్4 :ఖానాపూర్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నేపథ్యంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వివాదం నెలకొంది. అధికారులతో ఎమ్మెల్యే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలోనే సమావేశం నుంచి ఎమ్మెల్యే బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట భాజపా, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులను ఆయన బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. ఇలా వుంటే ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి , నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జోగు రామన్నను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లోని మాజీ మంత్రి ఇంటికి వెళ్లిన పోలీసులు హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హోంశాఖను తన ఆధీనంలో ఉంచుకొని ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు చేయించి జైలుకు పంపడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఖానాపూర్ నియోజకవర్గ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడంతో కుట్రా పూరిత చర్యలకు దిగజారడం శోచనీయమని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ నియమాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంగా జరగాల్సిన ఎన్నికలు పోలీసుల పహారా మధ్య వారికి అనుగుణంగా మార్చుకునే కుతంత్రాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## ఏప్రిల్ 19న తెలంగాణ మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

### జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని

ఖమ్మం, ఏప్రిల్ – 04 (విజన్ ఆంధ్ర )2026-27 విద్యా సంవత్సరానికి తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతి ప్రవేశాలు, 7 నుండి 10వ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను ఏప్రిల్ 19న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుండి 10వ తరగతుల పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఇటువంటి పుకార్లు గమనించినట్లయితే వెంటనే జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్, జిల్లా విద్యాశాఖాధికారికి సమాచారం అందించాలని తెలిపారు. టీజీ మోడల్ స్కూల్ కారేపల్లి, జెడ్పీఎస్ఎస్ కారేపల్లి, టీజీ మోడల్ స్కూల్ టేకులపల్లి కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారిణి వెల్లడించారు.

## యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



సూర్యాపేట ఏప్రిల్ 04:(విజన్ ఆంధ్ర)యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్ జి ఎం గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర స్థాయి 8వ రగ్బీ క్రీడలకు వారు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే క్రీడల్లో యువతను ప్రోత్సహించే దిశగా తనవంతు కృషి చేస్తానన్నారు. గతంలో మా తండ్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి క్రీడల మంత్రిగా పని చేసి క్రీడాలను ప్రోత్సహించారని తెలిపారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. నేర్చు కోవాలనే కోరిక, ఆడి గెలవాలనే పట్టుదల ఉంటే జిల్లా నుంచి కూడా రాష్ట్ర స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. క్రీడాకారులకు క్రీడలో అనుసరించాల్సిన సూచనలు, సలహాలు,మెలకువలు చెప్పారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని విద్యార్థులతో కాసేపు రగ్బీ ఆడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, కౌన్సిలర్స్ కొనతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, కోతి గోపాల్ రెడ్డి, జానయ్య, ఆలేటి మాణిక్యం, రాచకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జైదుపల్లి గ్రామ అభివృద్ధి లక్ష్యం

### 20 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్వాక్రా భవనం నిర్మాణం
### శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సహకారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్ రడ్డి ప్రత్యేక చొరవ
### గ్రామ సర్పంచ్ పట్నం పట్లోళ్ల మౌనిక శ్రీకాంత్ రెడ్డి



వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర) : గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని పట్లోళ్ల మౌనిక శ్రీకాంత్ రెడ్డి అన్నారు. 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో సిసి రోడ్లు డ్వాక్రా భవనం నిర్మాణం పనులు చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. శనివారం వికారాబాద్ మండల పరిధిలో గల జైదుపల్లి గ్రామ సర్పంచ్ విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బిల్లపాటి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో 20 లక్షలు మంజూరయ్యాయని ఆమె పేర్కొన్నారు. 10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పి పర్మా రెడ్డి ఇంటి నుండి నర్సింహారెడ్డి ఇంటి వరకు, ఎం విజయ్ కుమార్ ఇంటి నుండి నాదారం రఘు ఇంటి వరకు, బక్కి నాగేష్ ఇంటి నుండి బక్కి లక్ష్మి ఇంటి ముగింపు వరకు సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశామని ఆమె స్పష్టం చేశారు. 10 లక్షల నిధులతో మహిళా సమైక్య భవనం స్లాబ్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయని ఆమె తెలిపారు. గ్రామాభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో ఏ సమస్యలు ఉన్న వెంటనే నా దృష్టికి తీసుకుని రావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవన్నగారి ప్రవిత పాల్గొన్నారు.

## అక్సిజన్ అందక పసికందు మృతి

అనకాపల్లి జిల్లా: అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక మూడు రోజుల పసికందు మృతి డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన చోటు చేసుకుంది అంటూ తల్లిదండ్రులు ఆసుపత్రి ముందు స్థానికులు నిరసన తెలిపారు. కసింకోట మండలం గవరపేటకు చెందిన శ్రీనివాసరావు ఆమె భార్య తులసి ప్రసవం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో ఒకటో తేదీన అడ్మిట్ అయ్యి పెద్దాపరేషన్తో ఒక బిడ్డకు జన్మనిచ్చారు ఆ బిడ్డ పుట్టిన తర్వాత ఆరోగ్యం నిలకడగా ఉందని శుక్రవారం మధ్యాహ్నం బాబు ఫీడింగ్ సమయంలో రంగు మారడంతో డాక్టర్ను సంప్రదించగా వైద్యులు లేరని ఆరోపించారు దీంతో బాబు ఆక్సిజన్ అందక మరణించారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు

## స్ఫూర్తి మ్యూజిక్, డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 26న 'మేగా డాన్స్ ఫెస్ట్'

### –అకాడమీ డైరెక్టర్, ప్రముఖ కోరియోగ్రాఫర్ సూర్యతేజ సుబ్రాంత్ వెల్లడి





హైదరాబాద్, ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర) : ప్రపంచ నృత్య దినోత్సవం పురస్కరించుకొని స్ఫూర్తి మ్యూజిక్, డాన్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 26 బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య కళా నిలయంలో 'స్ఫూర్తి నేషనల్ మేగా డాన్స్ ఫెస్ట్' పేరిట కూచిపూడి, భరతనాట్యం, కథక్, పేరిణి నాట్యం, దేశభక్తి, జానపద, సినిమా వెస్టన్ డాన్స్ నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్, ప్రముఖ కొరియో గ్రాఫర్ ఇ.సూర్యతేజ సుబ్రాంత్ మాస్టర్ వెల్లడించారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'మేగా డాన్స్ ఫెస్ట్'కు సంబంధించిన బ్రోచర్ ను ఆవిష్కరించి మాట్లాడారు. 6 నుండి 60 ఏళ్ల ఏ నాట్య కళాకారులైన ఈ డాన్స్ ఫెస్టివల్లో పాల్గొని వారి నాట్య ప్రతిభను ప్రదర్శించవచ్చని తెలిపారు. పాల్గొనదలచిన నాట్య కళాకారులు, వారి గురువులు, తల్లిదండ్రులు ఈనెల 10 లోపు ఫోన్ : 9652347207 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు లయన్ డా.ఇ.యస్.సూర్య నారాయణ మాస్టర్, నాట్య గురువులు డా.గీతాలత, డా.ప్రతిభరాజు గౌడ్, ఝాన్సి, గౌరవ సలహాదారు లయన్ పి.ఉమాశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అమ్మాయి క్యాన్సర్ వ్యాక్సిన్ తీసుకోవాలి

### - అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ గోడ ప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా..

నిజామాబాద్ ఏప్రిల్04(విజన్ ఆంధ్ర): ప్రతి అమ్మాయి క్యాన్సర్ వ్యాక్సిన్ కచ్చితంగా తీసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార గోడ ప్రతులను శనివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వము ఆధ్వర్యంలో 14 ఏళ్ల అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ అందజేస్తుందన్నారు. దీనికి ప్రముఖ హీరో అల్లు అర్జున్ మద్దతుగా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. భవిష్యత్తులో అమ్మాయిలు క్యాన్సర్ బారిన పడకుండా ఈ వ్యాక్సిన్ ఎంతో తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు. అల్లు అర్జున్ ఫ్యాన్స్ చొరవ తీసుకొని అవగాహన కల్పించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల సురేష్, జిల్లా అధ్యక్షుడు నరేందర్, దీపక్, మహేష్, కృష్ణ, కార్తీక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పట్టుదలతో బోథ్ నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు



బోథ్ ,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర): ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని పలు మార్లు అసెంబ్లీలో ప్రస్తావించి పట్టువదలకుండా బోథ్ నియోజకవర్గ విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఎట్టకేలకు నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

## మన ఇసుక వాహనం అప్లికేషన్ ప్రారంభం

### తహసీల్దార్ లాగిన్స్, పీటీఎస్ హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా




ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 , (విజన్ ఆంధ్ర) ప్రజలకు ఇసుక రవాణా సేవలను మరింత సులభతరం చేయడం మరియు పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మన ఇసుక వాహనం" వెబ్, మొబైల్ అప్లికేషన్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం అధికారికంగా ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లా లోని బోరజ్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించి ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లాగిన్ విధానం, సేవల వినియోగంపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, మైనింగ్ ఏడి రవీందర్, తహసీల్దార్ రాజేశ్వరి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్,ఏప్రిల్4 సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రూ.50 లక్షల విలువైన గంజాయితోపాటు, రూ.72,500 నగదును రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయానికి యత్నించిన నలుగురిని అరెస్టు చేశారు. తుని నుంచి రైలులో హైదరాబాద్, ముంబయికి గంజాయి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# 'గాలికుంటు' నివారణ టీకాల పంపిణీ

### ఎంపేడులో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య అధికారులు



భూపాలపల్లి జిల్లా (టేకుమట్ల) 04 ఏప్రిల్ (విజన్ ఆంధ్ర)భూపాలపల్లి నియోజకవర్ టేకుమట్ల మండలంలోని ఎంపేడు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. గ్రామ సర్పంచ్ ఇసంపల్లి హారిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్య మండల అధికారి డాక్టర్ వివేక్ మరియు సిబ్బంది పాల్గొని గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇసంపల్లి హారిక మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ ఉచిత టీకా సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సకాలంలో టీకాలు వేయించడం వల్ల పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, సిబ్బంది, గ్రామ పంచాయతీ ప్రతినిధులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో ఏప్రిల్ 4(విజన్ఆంధ్ర)మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తమ సేవా భావాన్ని చాటుకున్నారు. తేది 31-03-2026 న రోడ్డు పై నిరాశ్రయంగా తిరుగుతున్న ఒక గుర్తు తెలియని మానసిక అస్వస్థత గల వ్యక్తిని స్వయంగా గుర్తించిన జిల్లా కలెక్టర్ అతనికి తక్షణమే సహాయం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ని ఆదేశించారు. కలెక్టర్ మానవతా దృక్పథంతో ప్రారంభమైన ఈ చర్య ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని తీసుకొచ్చింది. జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ వృద్ధాశ్రమ సిబ్బంది ఆ వ్యక్తిని సంరక్షణలోకి తీసుకుని, అతనికి ఆహారం, శుభ్రత, వైద్య సేవలు అందించారు. జగిత్యాల జిల్లా వాసి అయిన అతనికి సేవలు అందిస్తూ, వైద్య పరీక్షలు చేయించి, శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించి, కొత్త జీవితం ఇచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన చికిత్స అందించారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు 04-04-2026 న శనివారం కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ను బంధువులు కలసి 25 సంవత్సరాల తరువాత తమ కుటుంబ సభ్యుని తిరిగి పొందిన ఆనందంలో, జిల్లా కలెక్టర్ మానవత్వాన్ని కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటన ద్వారా జిల్లా కలెక్టర్ మానవత్వం, సేవా భావం, బాధ్యతాయుత పరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

## తక్షణ లాభాల ఆశలో భవిష్యత్తును పణంగా పెట్టొద్దు

### బెట్టింగ్‌లో పాల్గొంటే కేసులు, జైలు శిక్ష ఖాయం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



గద్వాల ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర)ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో యువతను దారి తప్పించే క్రికెట్ బెట్టింగ్స్‌పై జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు గట్టిగా హెచ్చరించారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు ఈ అక్రమ కార్యకలాపాల వైపు ఆకర్షితులవుతున్నారని, ఇది వారి జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్నదని పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్స్ కారణంగా యువత ఆర్థికంగా దెబ్బతిని, అప్పుల బారిన పడి, తీవ్ర నిరాశకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యల వరకు దారితీసే ప్రమాదం ఉందని, కుటుంబాలు కూడా తీవ్రంగా నష్టపోతున్నాయని స్పష్టం చేశారు. క్రికెట్ బెట్టింగ్ పూర్తిగా చట్ట విరుద్ధమని, ఇందులో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. బెట్టింగ్ నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మోసపూరిత మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రికెట్‌ను కేవలం వినోదంగా మాత్రమే చూడాలని, దానిని అక్రమ సంపాదనకు ఉపయోగించకూడదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారి రోజువారీ కార్యకలాపాలను గమనించాలని సూచించారు. మ్యాచ్‌ల సమయంలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే వెంటనే అప్రమత్తంగా ఉండాలని కోరారు. క్రికెట్ బెట్టింగ్, ప్లేయింగ్ కార్డ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జీవితాన్ని నిర్మించండి, బెట్టింగ్స్‌తో నాశనం చేసుకోకండి అంటూ జిల్లా ఎస్పీ ప్రజలకు, ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు.

# ప్రజల గడపకు పోలీసు సేవలు

## ఆన్‌సైట్ ఎఫ్ ఐఆర్ తో చేరువలో న్యాయం

### జిల్లా ఎస్పీ సునిత రెడ్డి వెల్లడి.. సంఘటన స్థలంలోనే ఫిర్యాదు నమోదు



వనపర్తి, విజన్ ఆంధ్ర ప్రతినిధి :ప్రజలకు మరింత చేరువగా, వేగవంతంగా మరియు పారదర్శకంగా పోలీస్ సేవలను అందించాలనే లక్ష్యంతో సీరియస్ నేరాలలో 'ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్‌విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వనపర్తి జిల్లా పోలీసు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించేందుకు "ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్ విధానాన్ని అమలు చేస్తోందని బాధితులు హత్య,అత్యాచారం, దోపిడీ / చోరీ, కిడ్నాప్,మహిళలు, చిన్నారులపై నేరాలు,రోడ్డు ప్రమాదాలు, ఎస్సీ ఎస్టీ, బాల్యవివాహాలు, ర్యాగింగ్ వంటి సీరియస్ నేరాల్లో బాధితులు పోలీస్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఎక్కడ ఉంటే అక్కడ బాధితుల నివాసం, హాస్పిటల్, రక్షణ ప్రదేశం, సంఘటన చోటుచేసుకున్న ప్రదేశంలోనే పోలీసు అధికారులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారు. సంఘటన స్థలంలోనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం ద్వారా ఆధారాలు సేకరణ వేగంగా నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందిని ఈ సేవ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు, మహిళలకు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా సమయం ఆదా అవడంతో పాటు, బాధితులకు తక్షణ సహాయం అందుతుందని, ప్రజలు ఎలాంటి సంఘటన జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని 'ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్' ద్వారా మీ వద్దకే వచ్చి సేవలు అందిస్తామని ఇది ప్రజల నమ్మకాన్ని పెంచే దిశగా తీసుకున్న కీలక నిర్ణయం. ప్రతి ఒక్కరూ ఈ సేవను వినియోగించుకొని న్యాయం పొందాలని, వనపర్తి జిల్లా పోలీసు ప్రజల భద్రత, సౌకర్యమే లక్ష్యంగా మరిన్ని వినూత్న సేవలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని ఎస్పీ తెలిపారు.

## ధర్మపురి సంజయ్ అనుచరుల నిరసనను విరమింపజేసిన నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ




నిజామాబాద్ ఏప్రిల్04 ( విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీలో తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అనుచరులు ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన నిరసనకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని మరియు నాయకుల కష్టానికి, అంకితభావానికి తగిన గుర్తింపు, పదవులు లభిస్తాయని హామీ ఇచ్చారు. ఎముఖ్యంగా మున్నూరు కాపు సామాజికవర్గానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని గుర్తు చేస్తూ, తనను నగర డీసీసీ అధ్యక్షుడిగా నియమించడం మరియు రాంభూపాల్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి కల్పించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో మున్నూరు కాపులకు పది కార్పొరేటర్ సీట్లు కేటాయించడంతో పాటు, వివిధ మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను మరియు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ (NSUI) లలో కీలక బాధ్యతలను అప్పగించినట్లు ఆయన వివరించారు. ఎభవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ, పార్టీ ప్రయోజనాలకు విరుద్ధంగా కాకుండా క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేయాలని కోరారు. మాజీ పిసిసి అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ వారసత్వాన్ని గుర్తు చేస్తూ, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. బొబ్బిలి రామకృష్ణ ఇచ్చిన హామీలు, చర్చల అనంతరం సంజయ్ అనుచరులు తమ నిరసనను విరమించి, పార్టీ విజయం కోసం కృషి చేస్తామని ప్రకటించారు

## భోస్రలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

బజార్‌హత్నూర్ ,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బజరత్నూర్ మండలం లోని భోస్ర గ్రామంలో నిర్వహిస్తున్న అఖండ శివ నామ సప్తాహం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయంలో భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు.



### కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాఅధికార కమిటీ ప్రతినిధిగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌నియామకం



జవహర్ నగర్, ఏప్రిల్ 4, (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాఅధికార కమిటీ ప్రతినిధిగా మల్లెపూల శ్రీకాంత్ యాదవ్‌నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన ఆయనను శనివారం జవహర్ నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సోమ నర్సింగ్ రావు ముదిరాజ్, రెడ్డబోయిన ఆంజనేయులు ముదిరాజ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాచర్ల సాయి కుమార్ ముదిరాజ్, పోచమైన నాగేష్ ముదిరాజ్, యాకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జూదం స్థావరంపై సీసీఎస్ దాడి



నలుగురి అరెస్ట్ నిజామాబాద్ ఏప్రిల్04:(విజన్ ఆంధ్ర)నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు, సిటీ క్రైమ్ స్టేషన్ బృందం శనివారం ఒక జూదం కేంద్రంపై మెరుపు దాడి నిర్వహించింది. సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో, జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని, కలిగోట్ గ్రామం శివార్లలో ఉన్న ఒక ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని, పోలీసులు ఈ దాడి చేపట్టారు.ఈ ఆపరేషన్ సమయంలో, అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి రూ. 10,940 నగదు, నాలుగు వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దాడి అనంతరం, సీసీఎస్ సిబ్బంది నిందితులను మరియు స్వాధీనం చేసుకున్న ఆస్తిని, తదుపరి చట్టపరమైన చర్యల కోసం జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కు అప్పగించారు.

## శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రాకు ఘన వీడ్కోలు



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 , (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా శిక్షణ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న సలోని చాబ్రా కు జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సలోని చాబ్రా తన శిక్షణ కాలంలో జిల్లాలోని వివిధ శాఖల పనితీరును క్షుణ్ణంగా అధ్యయనం చేసి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాలో పనిచేయడం తనకు మర్చిపోలేని అనుభవమని తెలిపారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, తోటి అధికారులు, సిబ్బంది అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సలోని చాబ్రాను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. వివిధ శాఖల అధికారులు ఆమెతో తమ పని అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో స్రవంతి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



బజార్ హత్నూర్ , ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర): ఈ నెల 6వ తేదీ, సోమవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి పిప్రి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహజన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సభ ప్రాంగణం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి కేటాయించిన స్థలాలు, ప్రజల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## జిల్లా కేంద్రంలో డీసీసీ నూతన కార్యవర్గం,యాక్షన్ కమిటీ మీటింగ్ జిల్లాకు విచ్చేసిన టి.పి. సి.సి.అధ్యక్షుడు, ఏఐసిసి సెక్రెటరీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కు విచ్చేసిన టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కి , ఏఐసిసి సెక్రెటరీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ సచిన్ సావంత్ కి మావల బైపాస్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ , జిల్లా ముఖ్య నేతలతో కలిసి మహేష్ కుమార్ గౌడ్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా జరిగిన యాక్షన్ కమిటీ మీటింగ్‌లో మహాత్మ గాంధీ, బాబా సాహెబ్ అంబెడ్కర్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా ఇటీవల నూతనంగా నియమితులైన డిసిసి కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలియజేసారు. కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తల వల్లే తాము తెలంగాణలో అధికారంలోకి వచ్చామని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లకు పైగా గెలుస్తామని అన్నారు. బీఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కేసుల పాలలై లాఠీలు దెబ్బలు తిన్నారని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ గెలిచి రాహుల్ ప్రధానమంత్రి అవుతారని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు .ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు –రైతు భరోసాతో వ్యవసాయానికి మంచి రోజులు తెచ్చామని గుర్తుచేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు.

## పాఠశాలలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం లోని దిగ్నూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలో వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు. వంటగది పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. భోజన నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న తాగునీటి సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను నిరంతరం శుభ్రపరచాలని సూచించారు. పాఠశాల గదులు, మరుగుదొడ్ల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన ఆయన, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణంలో విద్యనందించాలని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు



కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా పురోగతిపై ఉపాధ్యాయులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామంలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాస్, మౌనిక, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నూర్ సింగ్, సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ శ్రవణ్ కుమార్, ఈఈ చంద్రమోహన్, డీఈఈ రమణ, ఏఈఈ దివాకర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎం ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్ జిల్లాలోని ఎంజీఎం ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించేందుకు వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి లోని పలు వార్డులు, అత్యవసర విభాగం, ఔట్‌పేషంట్ విభాగం తదితరాలను సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు మరియు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, ఔషధాల లభ్యత, సిబ్బంది సమయపాలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్శనలో జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, డిఎం హెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డిబిసిడిఓ పుష్పలత ఆర్డీఓ సుమా, ఎంజీఎం, కేఎంసి సుపరింటెండెంట్స్ హరీష్ చంద్ర రెడ్డి, సంధ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి, డ్రగ్స్ ఐన్స్పెక్టర్, ఆర్ ఎం ఓ లు, అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా సమీక్ష



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 , (విజన్ ఆంధ్ర) రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రారంభోత్సవాలు, శిలాఫలకాల ఆవిష్కరణ వద్ద ప్రోటోకాల్ పాటించాలని, కేటాయించిన విభాగం వద్దనే ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉండాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ, ఇతర సర్టిఫికేషన్ అందజేత వంటి కార్యక్రమాలను నిర్ణీత సమయంలోగా, క్రమశిక్షణతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేదిక వద్ద తాగునీరు, సీటింగ్. పార్కింగ్, ఇతర ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్ వద్ద, విఐపి గ్యాలరీలో కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, అనుమతి ఉన్న వారు మాత్రమే అక్కడ ఉండేలా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, వివిధ శాఖల ఈఈలు, తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్భాటంగా జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ మొదటి సమావేశం – నియామక పత్రాలను అందించిన టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 , (విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో భాగంగా ఇటీవల నియమించిన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులు నూతన ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, అధికార ప్రతినిధుల సమావేశం కు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ . కార్యవర్గ సభ్యులందరికీ నియామక పత్రాలు అందించి వారితో ప్రమాణం చేయించారు, నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తదనంతరం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా నరేష్ జా దవ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని నూతనంగా నియమించబడ్డ కార్యవర్గ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతలతో బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ విలువలతో నడిచే పార్టీ అని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పని చేయాలని తెలిపారు ఈ సందర్భంగా వెనుక బడిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం కోసం& జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల కోసం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి గా మీ సహకారం ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ కు విన్నవించుకున్నారు. తదనంతరం తెలంగాణ పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల పార్టీ అని ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ డిసిసిలుగా ఆదివాసి గిరిజనులను నియమించడమే దీనికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త కు గుర్తింపు ఉంటుందని వచ్చే నామినేటెడ్ పోస్టుల్లో



కార్పొరేషన్ నియామకాల్లో గాని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకుల కు ఎక్కువ అవకాశం ఇస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకోసం జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం కృషి చేస్తుందని విమానాశ్రయం ఏర్పాటు తో ఆదిలాబాద్ పారిశ్రామిక అభివృద్ధికి ఎంత తోడ్పడుతుందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు, ఆర్ఎస్ఎస్ బిజెపి మతోన్మాద రాజకీయాలకు అడుగడుగున నిలువరించాలని గత పది సంవత్సరాలు గా రాముడి పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకొని దేశాన్ని అంబానీ ఆదాని లాంటి కార్పొరేట్లకు కట్ట పెట్టడం తప్ప పేద ప్రజలకు బీజేపీ చేసింది ఏమీ లేదని ఆయన అన్నారు, బిజెపి తన అధికారం కోసం ఎలక్షన్ కమిషన్ ను వాడుకుంటుందని ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ సానుభూతి ఓట్లను తొలగిస్తోందని ఇది దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలిపారు. దేశం మొత్తంలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం లో ని కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు పేదలకు రేషన్ కార్డులు ఉచిత సన్న బియ్యం పథకం, మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రుణమాఫీ, రాష్ట్రం ఎంత అప్పుల్లో ఉన్నరైతు భరోసా అమలు చేస్తున్నామని, పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇలా ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ సచిన్ సావంత్ , ఇంద్రకరణ్ రెడ్డి , మాజీ ఎంపీ సోయం బాపురావు , మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు , మాజీ ఎంపీ వేణుగోపాల చారి ,ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి , బోత్ నియోజకవర్గా ఇన్చార్జ్ ఆడే గజేంద్ర , ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్ , ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అను సతీష్ , జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య , ,టీపీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత , ఏఐసిసి ఇంటెక్చ్యుల్ ఫోరం తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , ఇచ్చోడా మార్కెట్ కమిటీ చైర్మన్ కుమర సత్యవతి కోటేష్ మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ,ఆదిలాబాద్ మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ , రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ శ్రీకాంత్ రెడ్డి , మాజీ డిసిసిబి చైర్మన్ అడ్డి బోజా రెడ్డి , జిల్లా కాంగ్రెస్ నాయకులు అశ్విన్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ పాటిల్ , ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ ,జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్ , సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మోతిరామ్ , ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగేలా నర్సింగ్ , జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులు,కాంగ్రెస్ ముఖ్య నాయకులు అనుబంధ సంస్థల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## అక్రమంగా గ్యాస్ సిలిండర్లలో గ్యాస్ నింపి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ఫిల్లింగ్ మిషన్, ఎలక్ట్రానిక్ వేటింగ్ మిషన్ సహా, 8 సిలిండర్లు స్వాధీనం**

**ఆదిలాబాద్ పట్టణంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లలో గ్యాస్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు**

**వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 ,( విజన్ ఆంధ్ర) పోలీసులకు అందిన సమాచారం మేరకు నిర్వహించిన తనిఖీలలో నిందితుడు ఫెరోజ్ ఖాన్ (వయస్సు 45 సంవత్సరాలు), నివాసం: ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీ, ఆదిలాబాద్ అనే వ్యక్తి గ్యాస్ రిపేర్ వర్క్ చేస్తూ, అదనపు ఆదాయం కోసం పరిచయస్థుల గ్యాస్ బుక్స్ ఉపయోగించి తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్లు తీసుకుని, తన ఇంటిలో చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నాడు.

తనిఖీలలో భాగంగా నిందితుడి ఇంటి వద్ద నుండి

1. 5 కేజీల హెచ్.పి. కమర్షియల్ ఖాళీ సిలిండర్లు (3)
2. 19 కేజీల భారత్ కమర్షియల్ ఖాళీ సిలిండర్ (1)
3. 14.2 కేజీల భారత్ డొమెస్టిక్ ఖాళీ సిలిండర్లు (2)
4. 14.2 కేజీల ఇండియన్ డొమెస్టిక్ ఖాళీ సిలిండర్లు (2)5. ఎన్. ఈ . ఓ కంపెనీ గ్యాస్ ఫిల్లింగ్ మిషన్ 6. టైగర్ కంపెనీ ఎలక్ట్రానిక్ వేటింగ్ మిషన్ 7. మూడు గ్యాస్ బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన గ్యాస్ బుక్స్ చిప్ప లక్ష్మీ, రాథోడ్ చంద్ర కుమార్, ఎస్.కె. ఇంజమామ్ హుల్ హక్ పేర్లపై ఉన్నవిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## గజదొంగ మొయిజ్ పై పిడి యాక్ట్ నమోదు

**దాదాపు 70 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడు.**
**15 సంవత్సరాలుగా దొంగతనం చేస్తున్న నిందితుడు.**
**2019లో ఒకసారి పీడీ యాక్ట్ నమోదు చేసి సంవత్సరం పాటు జైల్లో ఉన్న నిందితుడు.**
**ప్రవర్తన మార్చుకోకుండా మరల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగపై పిడి యాక్ట్ నమోదు**
**చర్లపల్లి జైలుకు తరలింపు.**
**ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు**



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గజదొంగ మొయిజ్‌పై పోలీసులు పిడి యాక్ట్ ( ప్రివేంటి డిటెక్షన్ యాక్ట్ ) నమోదు చేశారు. నిందితుడు గత దాదాపు 15 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతూ, ఇప్పటివరకు సుమారు 70 దొంగతనం కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. టూ టౌన్ ఇన్స్పెక్టర్ కె నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం, మొయిజ్ 2019 సంవత్సరంలో కూడా పిడి యాక్ట్ కింద కేసు నమోదు కాగా, ఒక సంవత్సరం పాటు జైలులో శిక్ష అనుభవించాడు. అయితే జైలు నుంచి విడుదలైన తరువాత కూడా తన ప్రవర్తనలో మార్పు లేకుండా మళ్లీ దొంగతనాలకు పాల్పడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాడు. ఇలాంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ నిందితుడిపై మళ్లీ పిడి యాక్ట్ నమోదు చేయడం జరిగింది. పీడీ యాక్ట్ నమోదైన నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగింది అని తెలిపారు. నిందితుల అక్రమ కార్యకలాపాలను అరికట్టడమే పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కె. నాగరాజు మాట్లాడుతూ, పునరావృతంగా నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టం పట్ల ఎలాంటి ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## తపాలా శాఖలో నిధుల దుర్వినియోగం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రిమాండ్

### రూ. 2,12,033/- దుర్వినియోగం చేసినట్లు కేసు నమోదు :రూరల్ సీఐ కే ఫణిదర్

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో తపాలా శాఖకు చెందిన నిధులను దుర్వినియోగం చేసిన ఘటనలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలలోకి వెళితే, రుయ్యడి గ్రామానికి చెందిన గ్రామీణ డాక్ సేవక్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అబ్దుల్ నిజాం అనే వ్యక్తి రూ. 2,12,033/– మొత్తాన్ని చీట్ చేసి తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు తేలింది. ఈ మేరకు పోస్టల్ ఇన్స్పెక్టర్ నాగిరెడ్డి రాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తలమడుగు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. దర్యాప్తు అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని, శనివారం ఆదిలాబాద్ రూరల్ సీఐ కే. ఫణిధర్ ఆధ్వర్యంలో రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో




తలమడుగు ఎస్సై డి రాధిక పాల్గొన్నారు.

## డొమెస్టిక్ గ్యాస్ దుర్వినియోగం పై పట్టణంలో ప్రత్యేకత తనిఖీలు

**డొమెస్టిక్ గ్యాస్ ను ఉపయోగిస్తున్న 6 వాణిజ్య సముదాయాలపై కేసులు నమోదు.**
**8 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం.**
**వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు.**
**నిబంధనలు అతిక్రమించిన గోకుల్ చాట్ టిఫిన్స్, విన్నీ బేకరీ వినాయక చౌక్, వినాయక మేస్, సమృద్ధి టీ స్టాల్, కారం దోస హోటల్, హాట్ చిప్స్.**
**వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్.**

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04 , (విజన్ ఆంధ్ర ) వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డొమెస్టిక్ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వారిపై పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తూ డొమెస్టిక్ గ్యాస్‌ను ఉపయోగిస్తున్న గోకుల్ చాట్ టిఫిన్స్, విన్నీ బేకరీ (వినాయక చౌక్), వినాయక మెస్, హాట్ చిప్స్, సమృద్ధి టీ స్టాల్, కారం దోస హోటల్‌లపై కేసులు నమోదు చేశారు. మొత్తం 8 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ హెచ్చరించారు. వాణిజ్య అవసరాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కుర్చేసుకాని ప్రాజెక్టును పూర్తి చేస్తానన్న కేసీఆర్ కు కుర్చీ దొరకలేదా..?


మహబూబ్ నగర్ : కుర్చీ వేసుకుని కూర్చొని మూడేళ్లలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ను పూర్తి చేస్తానన్న కేసీఆర్ కు ఇక్కడ కూర్చుని ప్రాజెక్టు పూర్తి చేయడానికి కుర్చీ దొరకలేదా అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం మహ బూబ్ నగర్‌జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాకు ఏమీ చేయని హరీశ్ రావు శుక్రవారం విహారయాత్ర తరహాలో జిల్లాకు వచ్చి కొడంగల్, మక్తల్ ప్రాజెక్టుల గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిపోయాడని ఆయన విమర్శించారు. మూడు సంవత్సరాల్లో పూర్తి చేసుకున్న కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న ప్రేమ, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై లేదన్నారు. దాదాపు 10 సంవత్సరాలు పాలించినా ప్రాజెక్టు పూర్తి చేయలేదని ఆయన మండిపడ్డారు. ఎన్నికల సమయం లో ఆదర బాదరాగా వచ్చి ఒక్క పంపుతో నీళ్ళను వదలి ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని విమర్శించిన నీకు, గ్యారెంటీల అమలు, జరుగుతున్న అభివృద్ధి కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ వంటివి అనేక సంక్షేమ పథకాలు కళ్లకు కనిపిస్తలేవా అని నిలదీశారు. 25 లక్షల మంది రైతులకు 22 వేల కోట్ల రూపాయలు



వారి ఖాతాలో జమ చేశామని, రైతు భరోసా, బోనస్, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదలను ఆదుకున్నామని ఆయన వివరించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లా ప్రజలను మోసం చేసి ఏం మోహం పెట్టుకొని వచ్చి ప్రజలను మభ్యపెడుతున్నా వని, వరుస ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా సిగ్గు రాలేదని ఆయన దుయ్యబట్టారు. డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మాట్లా డుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ఫోటో షూట్ కోసం పాలమూరు ప్రాజెక్టు ను ప్రారంభించినట్లు నటించి ప్రజలను మోసం చేయడానికి చూశారని, అయినా ప్రజలు నమ్మలేదని ఆయన విమర్శించారు. త్వరలోనే పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల పాదాలు తడుపుతామని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. ఈ సమావేశంలో ముడా చైర్మెన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ బెక్కెరి అనిత,సిరాజ్ ఖాద్రీ,చంద్రకుమార్ గౌడ్, సిజె బెనహర్, పాల్గొన్నారు.

# రోడ్డు ఆక్రమణలపై కఠిన చర్యలు గజులరామారంలో ప్రత్యేక డ్రైవ్

## మల్లారెడ్డి ఆసుపత్రి నుంచి అంబేద్కర్ భవన్ వరకు విస్తృతంగా తొలగింపు ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో చర్యలు ఇకపై నిరంతర పర్యవేక్షణ




గజులరామారం, ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర): ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో గజులరామారం సర్కిల్ పరిధిలో రోడ్డు ఆక్రమణలపై అధికారులు కఠినంగా వ్యవహరించారు. సి.ఎం.సి కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్, గజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మల్లారెడ్డి ఆసుపత్రి నుండి అంబేద్కర్ భవన్ వరకు ఉన్న రహదారిపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది విస్తృతంగా తొలగించారు. ఈ డ్రైవ్‌ను జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో సమన్వయంతో నిర్వహించడం ద్వారా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. రోడ్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు, దుకాణ విస్తరణలు, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి పాదచారులకు, వాహనదారులకు సౌలభ్యం కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నగర అభివృద్ధి, ట్రాఫిక్ సౌకర్యం దృష్ట్యా ఇలాంటి ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు ఇకపై క్రమం తప్పకుండా కొనసాగుతాయని, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

# తలకు... శిరస్త్రాణ రక్షణ ఏది



ముధోల్:ఏప్రిల్ 04:విజన్ ఆంధ్ర : పోలీసులు వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను చేస్తున్నారు. కానీ శనివారం ముధోల్ మండల కేంద్రంలో ఓ ద్విచక్ర వాహనదారుడు తలకు... శిరస్త్రాణ రక్షణగా ధరించకుండా వాహనాన్ని నడుపుతూ పక్కన ఉన్న మహిళ కు శిరస్త్రాణ ధరించిన ఫోటో విజన్ ఆంధ్ర కెమెరాకు చిక్కింది. దీంతో రోడ్డు ప్రమాదాలపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టిన వాహనదారులు పట్టించుకోవడం లేదని పలువురు చర్చించుకుంటున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ సలహాదారును కలిసిన బంజారా నాయకులు...



బోధన్, ఏప్రిల్04 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ని శనివారం హైదరాబాద్ నగరంలో బోధన్ నియోజకవర్గ బంజారా నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మార్చి 08న బోధన్ పట్టణంలో అధికారికంగా నిర్వహించిన సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలు విజయవంతం కావడానికి సహాయ సహకారాలు అందించిన సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి మెమోంటో అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బంజారా భవన్ కు కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన ను కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మూడ్ బాబు రామ్ నాయక్, ఏఐబిబిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూక్యా చంద్రు నాయక్, మాజీ ఐడీసీఎంఎస్ ఉమ్మడి జిల్లాలా చైర్మన్ బాధవత్ తారాచంద్ నాయక్, ఏఐబిబిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ గణేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు దెగవత్ దూప్ సింగ్ నాయక్, బోధన్ మండల అధ్యక్షులు విశ్వనాథ్ నాయక్, ఉట్పల్లి ఉప సర్పంచ్ నరేందర్ గౌడ్, ఏఐబిబిఎస్ మాజీ అధ్యక్షులు సంజీవ్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

# టీపీసీసీ ఛీఫ్ కు కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం



ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి,ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారకార్యక్రమానికి ,పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కేంద్రానికి విచ్చేసిన టీపీసీసీ ఛీఫ మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ లకు అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు.శనివారం మావల బైపాస్ వద్ద డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నేతలను పూల బొకేలతో స్వాగతించారు.శాలువాలతో సత్కరించి పట్టణంలోనికి ఘన స్వాగతం పలికారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు - ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 04, (విజన్ ఆంధ్ర) : అర్హులైన ప్రతీ ఒక్కరికీ అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతాయని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం చిల్పూరు మండల కేంద్రంలో చిల్పూరుగుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 40మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 40లక్షల 04వేల 640 రూపాయలు, 41మంది సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు 12లక్షల 74వేల రూపాయల చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 8లక్షల కోట్లకు వాయిదాలు, మిత్తిలు చెల్లిస్తూ కూడా పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చెస్తోందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత విద్యుత్, పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా ఉచిత సన్న బియ్యం పంపిణి చేస్తున్నామని అన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు అండగా నిలుస్తూ రైతులకు రైతు భరోసా ద్వారా పెట్టుబడి సహాయం, సన్నాలకు రూ 500 బోనస్, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించడం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. పేద ప్రజల స్వంత ఇంటి కళను సాకారం చేసేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలను చేపట్టి ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 2014కు ముందు ఉన్న ఆస్తులు ఎన్ని ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎన్నో చెప్పమంటే ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు.



కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ వనరులు దోచుకొని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఇవాళ వాళ్లే సుద్దపూసల లెక్క మాట్లాడుతున్నారని ఏద్దేవా చేశారు. ఇక ప్రజల చేత పార్టీల చేత తిరస్కరించబడిన వాళ్ళు కూడా సిగ్గులేకుండా చాలా మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. చిల్పూర్ మండల కేంద్రంలో త్వరలోనే ఎమ్మార్వో, ఎంపీడివో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికీ మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తున్నట్లు దీనిపై త్వరలోనే దేవాదాయ శాఖ కమిషనర్ తో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచులు నలిమెల అనిత, ఎనగందుల నర్సింహ్మా రెడ్డి, శాతబోయిన రాజు, చిర్ర నాగరాజు గౌడ్, వేముల వెంకటేశ్వర్లు, పేరాల సుదాకర్, ఎనగందుల రత్నకర్ రెడ్డి, గడ్డమీది సురేష్, ప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న అడవులు ప్రమాదంలో వన్యప్రాణులు

## మండలంలో జాడలేని అటవీ శాఖ అధికారులు

## భారీగా తరలిపోతున్న వృక్ష సంపద




మర్పల్లి,ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర): వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలో ఉన్న కొద్దిపాటి అడవులు వేగంగా అంతరించిపోతుండగా, వన్యప్రాణులు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయి. అటవీ ప్రాంతాలు క్రమంగా ఎడారులుగా మారిపోతుండటం పర్యావరణానికి ముప్పుగా మారింది. అడవులు నాశనం కావడంతో వన్యప్రాణులు జనావాసాల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు, అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం తీవ్ర విమర్శలకు గురవుతోంది. మండలంలోని కల్కోడ అటవీ ప్రాంతంలో యదేచ్ఛగా అక్రమ కలప రవాణా జరుగుతుందని ప్రజల ఆరోపిస్తున్నారు.మండలంలోని కట్టెల మిషన్లో టేకు చెట్లను అనుమతులు లేకుండా కోత కోస్తున్నారు. కట్టెల కోత మిషన్లపై పర్యవేక్షణ చేయకుండా వారి దగ్గర నుంచి ముడుపులు తీసుకుని వదిలేస్తున్నట్లు ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఎక్కడ చూసినా అక్రమ రవాణా చేసిన చెట్లను నరికి కలప తరలిస్తున్నా కూడా చూసి చూడనట్లుగా వదిలేస్తున్నారనే ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు మామూలు తీసుకుంటే సరిపోతుందని భావించి చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండల పరిధిలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం జింక సంచరిస్తుండగా, వీధి కుక్కలు వెంటపడటంతో అది ప్రాణాలు కోల్పోయింది. ఇలాంటి ఘటన గతంలో కోట మర్పల్లి గ్రామంలో కొండే గొర్రె ప్రమాదం జరిగి చనిపోయింది అడవులు తగ్గిపోవడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్న దుస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే నర్సాపూర్ గ్రామంలో చెరువులో ముసలి ఉందని స్థానికులు పలుమార్లు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇలా మండలంలో ఎన్ని సంఘటనలు జరుగుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరస్తున్నారు. అంతేకాకుండా అటవీ భూముల్లో నుంచి ఎర్ర మట్టి తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నాప్పటికీ అధికారులకు వాటాలు వెళ్లడంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు అని ప్రజలు బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అక్రమ వనరుల నరికివేతను అరికట్టి, వన్యప్రాణులను రక్షించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే పర్యావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని అడవి భూములను అడవి జంతువులను రక్షించే బాధ్యత అటవీ శాఖ అధికారులపై ఉందని వెంటనే చర్యలు చేపట్టాలని మండలంలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజల వద్దకే పోలీసు సేవలు

## కొత్త విధానాన్ని వినియోగించుకోండి

## ఇంటివద్దే ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీస్ శాఖ

కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), 4 ఏప్రిల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ప్రవేశపెట్టిన 'సిటిజన్ సెంట్రిక్ అప్రోచ్' విధానాన్ని కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ ఎస్. వెంకట్ రెడ్డి సూచించారు. ఈ విధానం ద్వారా బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమకు అనుకూలమైన ప్రదేశంలో లేదా ఇంటి వద్దనే ఫిర్యాదు ఇవ్వవచ్చు. బాధితులు కోరిన వెంటనే పోలీసు అధికారులు వారి వద్దకు చేరుకుని ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసి, ఉచితంగా ఎఫ్ఐఆర్ కాపీ అందజేస్తారు. లైంగిక దాడులు, హత్యలు, దాడులు, మహిళలు మరియు చిన్నపిల్లలపై జరిగే నేరాలు, అట్రాసిటీ కేసులు వంటి ఘటనల్లో బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితుల్లో 100 నంబర్‌కు కాల్ చేస్తే, పోలీసులు వారి ఇంటికే చేరుకుని ఫిర్యాదు స్వీకరించి చర్యలు తీసుకుంటారు. జనవరి నెల నుంచి ఇప్పటివరకు కల్వకుర్తి డివిజన్ పరిధిలో 5 కేసుల్లో బాధితుల ఇంటికే వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి ఆసరాగా రూరల్ డెవలప్మెంట్ సర్వీసెస్ సొసైటీ

మల్హార్, ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర ): మలహార్ మండలం, నాచారం గ్రామానికి చెందిన కౌలు రైతు బండారు దేవేందర్ (33) కుటుంబానికి రూరల్ డెవలప్మెంట్ సర్వీసు సొసైటీ (ఆర్డీఎస్ఎస్) ఆర్థిక చేయూతనిచ్చి మానవత్వాన్ని చాటుకుంది. దేవేందర్ మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని పంట తెగుళ్లతో నష్టపోయి అప్పుల బాధతో గత సంవత్సరం జూలై లో ఆత్మహత్య చేసుకోగా ఇటీవల రైతు స్వరాజ్య వేదిక బృందం బాదిత కుటుంబాన్ని పరామర్శించి భార్య తన ముగ్గురు పిల్లలను పోషించడానకి పడుతున్న ఇబ్బందులు గుర్తించిన రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సోసైటి దృష్టికి తీసుకెళ్లారు. సానుకులంగా స్పందించిన సోసైటి బాదిత కుటుంబ జీవనోపాదీ కోసం రూ 50 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ మొత్తంతో ఆ కుటుంబానికి గొర్రెలను కొనుగోలు చేసి శనివారం బాదిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ కర్ణాటకపు కు సమ్మయ్య మాట్లాడుతూ జిఓ 421 అమలు చేసి పంట నష్ట పోయి



ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు బి కొండల్ రెడ్డి, ముక్క అయిలన్న, సమన్వయకర్తలుగా వ్యవహరించగా జిల్లా కో కన్వీనర్ చల్లగురుగుల సంజీవ్. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ కోసం హత్య.. నిందితుడిని రిమాండ్ కి తరలింపు

కామారెడ్డి : సెల్ ఫోన్ కోసం తోటి కూలినే హత్య చేసి పరారైన నిందితుడిని పట్టుకొని శనివారం అరెస్ట్ చేసే రిమాండ్ కి తరలించినట్టు కామారెడ్డి సబ్ డివిజనల్ ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. సంఘటనకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకి వెల్లడించారు. కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో గత ఫిబ్రవరిలో సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. కేవలం మొబైల్ ఫోన్, నగదు కోసం తోటి కూలీని అత్యంత కిరాతకంగా హతమార్చిన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. గత ఫిబ్రవరి 12న రాత్రి సుమారు 8:55 గంటల సమయంలో, కామారెడ్డి బస్టాండ్ ఎంక్వయిరీ కౌంటర్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య మొబైల్ ఫోన్ విషయం పై ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మహారాష్ట్రలోని అర్ని తలోక్ జిల్లా పంగిడి కి చెందిన నిందితుడు ఆకాష్ నాగురావ్ కోవె బాధితుడైన శ్రీనివాస్ (కూలీ) ముఖం, ఛాతిపై విచక్షణారహితంగా దాడి చేసి, కింద పడేసి చంపాడు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్, రూ.300 నగదును దోచుకుని అక్కడి నుండి పరారయ్యాడు. ఈ విషయం పై బస్టాండ్ కంట్రోలర్ షెర్ల సత్య గౌడ్ ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్ప దంగా తిరుగుతుండగా పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారించగా.. అతను తన నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన కామారెడ్డి పట్టణ ఇన్ స్పెక్టర్ నరహరి, ఏఎస్ఐ రంగా రావు, కానిస్టేబుళ్లు కమలాకర్, రాజు, సంపత్ అభినందించారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ రమేష్ కుమార్



గంభీరావుపేట ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర): గంభీరావుపేట మండలంలోని నర్మల మహిళా గురుకుల పాఠశాలలో శనివారం రోజున గురుకుల పాఠశాలను లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ రమేష్ కుమార్ తనిఖీ చేసి వంటగదిలను, పరిసర ప్రాంతాలను తిరిగి శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పిల్లలతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం పిల్లలకు రోజు ఆహార అందించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులపాటు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా శ్రీ సీతారామచంద్రస్వామి రథోత్సవం

## -మహోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన భక్తులు



గంభీరావుపేట ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర): శ్రీ సీతారామస్వామి నామస్మరణ మార్మోగింది. గంభీరావుపేట మండల కేంద్రంలో శ్రీ సీతారామస్వామి ఐదంతస్తుల రథోత్సవ పై శనివారం రోజున అత్యంత వైభవంగా కన్నుల పండువగా సాగింది. శ్రీరామనవమి నుండి ఆలయంలో మొదలైన బ్రహ్మోత్సవాల 9వ రోజు ఆలయం నుండి బయలుదేరిన స్వామి వారిని ఐదంతస్తుల రథోత్సవ సేవ పై ప్రజల దర్శనానికి పురవీధుల గుండా ఊరేగించారు.. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి మంగళ హారతులతో పాటు స్వామివారికి కట్న కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం జరగనుంది. రథోత్సవ మహోత్సవం పురస్కరించుకొని వచ్చే భక్తులకు పలువురు గ్రామస్తులు మంచినీరు, మజ్జిగ సౌకర్యం కల్పించారు. బ్రహ్మోత్సవాలకు వివిధ జిల్లాల నుండివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు దగ్గరుండి ఏర్పాట్లు చేశారు.

# తానూర్ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో 'గంజా గస్తీ' అవగాహన



తానూర్, ఎప్రిల్ 4(విజన్ ఆంధ్ర): నిర్మల్ ఎస్పీ ఆదేశాల మేరకు తానూర్ జెడ్పీహెచ్ఎస్ లో 'గంజా గస్తీ' కింద మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు, ముధోల్ సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ షేక్ జుబేర్ విద్యార్థులతో మాట్లాడి, గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలు వివరించారు, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు,ప్రధానోపాధ్యాయులు సాయిబాబు, ఉపాధ్యాయులు,విద్యార్థులు,పాల్గోన్నారు.

# అంగన్వాడిలో అన్నప్రాసన కార్యక్రమం



దౌల్తాబాద్, ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) : మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలోని ఒకటవ అంగన్వాడి కేంద్రంలో శనివారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పంజ స్వామి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసనం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హంసకేతన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు పాల్గొన్నారు.

# ప్రముఖ విద్యావేత్త ఆషియా బేగంకు 'ఉమెన్ ఐకాన్-26' పురస్కారం



హైదరాబాద్, ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర) : అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా మయూరి శ్రీ అకాడమీ ఏప్రిల్ 6న నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో ఉమెన్ ఐకాన్ అవార్డ్స్-26 కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇ.పురుషోత్తం, ఓయూ వాణిజ్య విభాగం ప్రొఫెసర్ సి.వి.రంజని, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలచారి నమొజు హాజరు కానున్నారు. ది స్టార్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆషియా బేగం 24 ఏళ్లకు పైగా విద్యా రంగానికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఉమెన్ ఐకాన్ అవార్డ్ 2026తో సత్కరించ బడనున్నారు. ఆంగ్ల విభాగాధిపతి నేహా బేగం వినూత్న బోధనా పద్ధతులకు గాను 'ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ అవార్డు-26'ను అందుకోనున్నారు. 11 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న తెలుగు ఉపాధ్యాయురాలు నజ్నీన్, తెలుగు భాషపై ఆమెకున్న నిబద్ధతకు గాను గుర్తింపు పొందారు.

# ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 04 ( విజన్ ఆంధ్ర ) : జిల్లాలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి 11 నెలల శిక్షణ కాలాన్ని పూర్తి చేసుకొని వెళ్తున్న క్రమంలో జిల్లా యంత్రాంగం వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిజాయితీగా పనిచేయడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. హర్ష్ చౌదరి ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ గా 11 నెలల పాటు వివిధ శాఖల్లో ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కలెక్టర్ అన్నారు. మారుమూల మండలం దౌల్తాబాద్ తహసిల్దారుగా విధులు నిర్వహించే క్రమంలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా మౌలిక సదుపాయాలతో పాటు రెవెన్యూ సమస్యల పెండింగ్ లు తగ్గించడంలో అంకితభావంతో పనిచేశారని కలెక్టర్ అన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతలను నిజాయితీగా నిర్వహిస్తూ తన పట్ల నమ్మకాన్ని పెంపొందించుకున్నారని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మృదు స్వభావి అని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకునే వారని అన్నారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో శిక్షణ కాలం పూర్తిగా విజయవంతం చేసుకోవడానికి కలెక్టర్లు, జిల్లా అధికారులు తోడ్పాటు అందించారన్నారు. జిల్లాలో శిక్షణ కాలం పూర్తి చేసుకోవడం సంతృప్తి కలిగించిందని అన్నారు. శిక్షణకాలంలో తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు, ఆర్డిఓలు, జిల్లా అధికారులు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి ని పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ లు వాసు చంద్ర, కె. అనిత, డిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, డిటి డబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోక్సో చట్టం పై అవగాహనా సదస్సు

**- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఖ. లక్ష్మీపతి గౌడ్ .**



నారాయణపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా శనివారం నాడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట టౌన్ గవర్నమెంట్ హై స్కూల్ (గ్రౌండ్) లో బాల బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది . ఈ సదస్సుకు డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మిపతి గౌడ్ హాజరైయ్యారు. ఇట్టి సదస్సులో వారు పోక్సో చట్టం గురించి మాట్లాడుతూ పోక్సో చట్టం (POCSO Act ` Protection of Children from SeIual Offences Act, 2012) నవంబరు 14, 2012 నుండి అమలులోకి వచ్చినదని, ఈ చట్టమును అతిక్రమిస్తే కఠిన శిక్షలు వుంటాయని, 18 ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడానికి, బాధితులకు సత్వర న్యాయం అందించడానికి, పిల్లల భద్రతను కాపాడటానికి రూపొందించబడిందని తెలిపారు . గుడ్ టచ్ , బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ బాలికలను అనవసరంగా తాకడం, లైంగిక వేధింపులకు గురి చేయడం, అశ్లీల చిత్రాలు వంటి వివిధ రకాల నేరాలకు పాల్పడితే ఇందులో కఠిన శిక్షలు ఉన్నాయని, లైంగిక నేరం జరిగినట్లు తెలిస్తే, వెంటనే పోలీసులకు లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , సమాచారం దాచడం కూడా నేరమేనని, నేరం గురించి తెలిసినా, అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు లేదా స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్‌కు తెలపడం చట్టరీత్యా తప్పనిసరి అని తెలిపారు . ఇట్టి కార్యక్రమానికి హాజరైన పారా లీగల్ వాలంటీర్ హాజమ్మ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి తెలుసుకొని తమని తాము రక్షించుకుంటూ ఇతరులు కూడా ఈ చట్టం ద్వారా రక్షణ పొందే విధంగా ఉండాలని కోరారు . ఈ కార్యక్రమములో స్కూల్ హెడ్ మాస్టర్ దత్తు రావు, స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలు కీలకం కలెక్టర్ బాదావత్ సంతోష్

**- సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి సేవలకు ప్రశంసలు..**

**- పాఠశాల పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు**



కల్వకుర్తి (విజన్ ఆంధ్ర), 4 ఏప్రిల్ 2026: గ్రామ ప్రజల సురక్షిత భద్రతకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శనివారం కల్వకుర్తి మండలం తాండ్రా గ్రామంలో సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి తన సొంత నిధులతో రూ.12.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 67 సీసీ కెమెరాలను గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీసీ కెమెరాల నిఘాలో గ్రామాలు మరింత సురక్షితంగా మారుతాయని, నేరాల నియంత్రణలో ఇవి కీలకంగా పనిచేస్తాయని అన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది భద్రతా సిబ్బందితో సమానమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి చేస్తున్న కృషిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రూ.70 లక్షలతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించి, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. అనంతరం గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేసి పాఠశాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి, ఇడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, సాయి రెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో పర్యటనలు పెంచి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం బ్యూరో ఏప్రిల్ 05 (విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ క్షేత్రాలు తదితరాలను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "క్షేత్రస్థాయిలో పర్యటనలు పెంచి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి" అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని తెలిపారు . భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మొదటగా అనంతోగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, గ్రామంలో మంజూరైన 19 ఇళ్లలో ప్రస్తుతం 3 ఇళ్లు రూఫ్ స్థాయికి చేరుకున్నట్లు అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారు గలిగ నాగలక్ష్మి ఇంటి నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, పనుల నాణ్యత, వినియోగిస్తున్న సామాగ్రి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి నాణ్యమైన గృహాన్ని అందించాలన్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఆళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకుని, బయాలజీ వంటి విషయాల్లో డయాగ్రామ్స్ ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పాఠశాల కిచెన్, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యుత్ సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిన నేపథ్యంలో, ఇన్వర్టర్



ఏర్పాటు ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆళ్లపల్లి గ్రామంలో రైతు మద్దెల వెంకటేశ్వర్లు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించిన కలెక్టర్, సాగు విధానం, దిగుబడి, ఆదాయం వంటి అంశాలపై రైతుతో చర్చించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. మండలంలో 400 ఎకరాల లక్ష్యానికి గాను 290 ఎకరాల్లో సాగు పూర్తయిందని అధికారులు వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలు, ల్యాబ్, మందుల గది తదితరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అవసరమైన అన్ని మందులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, వాటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. 108 అంబులెన్స్ సేవలను కూడా పరిశీలించి, అత్యవసర సేవలపై వివరాలు సేకరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, కార్యాలయ పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా "క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై అధికారులు దృష్టి సారించాలి" అని స్పష్టం చేశారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలోని త్రాగునీటి పరిస్థితిపై విచారించిన కలెక్టర్, మిషన్ భగీరథ ద్వారా సరఫరా సక్రమంగా కొనసాగుతున్నప్పటికీ, ఎండాకాలంలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, లేకపోతే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫాగింగ్ యంత్రాల వినియోగంపై కూడా సమీక్షించారు. మొబైల్ సిగ్నల్ సమస్యలపై విచారించగా కొన్ని గ్రామాల్లో కనెక్టివిటీ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వ్యవసాయ రంగంపై సమీక్షలో భాగంగా మండలంలో సాగు అవుతున్న పంటల వివరాలు తెలుసుకున్నారు. నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితి, బోర్ల ద్వారా సాగునీటి అందుబాటుపై అధికారులను ప్రశ్నించారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి, ప్రతి మహిళను సంఘాల్లో సభ్యురాలిగా చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనుల పురోగతిని కూడా సమీక్షించారు. విద్యాశాఖపై సమీక్ష సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో మండలంలో ఉన్న అన్ని పాఠశాలలు మెనూ పాటించకపోవడంతో పాటు ఆహార నాణ్యత లోపాలు తమ పరిశీలనలో వచ్చాయని ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, అన్ని పాఠశాలలను నిరంతర తనిఖీలు చేసి నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనియెడల నీపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ శాంతారావును హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని ఆదేశించారు. త్రాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ జగదీష్వర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీను, మండల ప్రత్యేక అధికారి లాల్ చంద్, ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి,వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం బ్యూరో ఏప్రిల్ 05(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యశాఖ అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆసుపత్రుల పనితీరు, అభివృద్ధి పనులు, ఆరోగ్యశ్రీ సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలవుతున్న ఆరోగ్యశ్రీ సేవలపై పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రుల పరిధిలో కొనసాగుతున్న నూతన నిర్మాణాలు, మరమ్మత్తుల పనుల పురోగతిని సమీక్షించి, పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఆసుపత్రి వారీగా సూపరింటెండెంట్ల నుండి సమాచారం సేకరించి, ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు, సిబ్బంది కొరత, వైద్యుల లభ్యత వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్ల మరమ్మత్తుల అవసరాన్ని సూపరింటెండెంట్ తెలియజేయగా, వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న అత్యాధునిక



వైద్య సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రులపైనే విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల వివరాలను సమీక్షించి, అవసరమైన చోట సేవలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తగిన శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల పనితీరు, రక్త నిల్వల వివరాలను పరిశీలించి అత్యవసర సేవలకు ఎటువంటి లోటు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి కృషి చేయాలని, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో నమోదు అవుతున్న సికిల్ సెల్ అనీమియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కేసుల అధికత ఉన్న మండలాలు, పరీక్షల నిర్వహణ విధానం, కిట్ల లభ్యతపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఓ రవిబాబు , ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చెరువులు, కుంటల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

**- తెలంగాణ బీసీ మహాసభ వినతి**

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర : మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతానికి గురవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ బీసీ మహాసభ ప్రతినిధులు జాతీయ అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యం లో శనివారం మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతూ నీటి వనరులు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులు గ్రామీణ జీవన విధానానికి, వ్యవసాయానికి ప్రాణాధారమని పేర్కొంటూ, వాటి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారులి సమస్యను ఎంతో ముఖ్యమైనదిగా పరిగణిస్తూ సానుకూలంగా స్పందించారు.



చెరువులు, కుంటల పరిరక్షణకు సంబంధించి త్వరలోనే అన్ని సంబంధిత శాఖల అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ గారితో సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. అలాగే, అన్యాక్రాంతమైన ప్రాంతాలను గుర్తించి తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసభ జిల్లా అధ్యక్షులు కుమ్మరి రాంచంద్రయ్య, నాయకులు ముత్యం స్వామి, కనీకే క్రాంతికుమార్, మహబూబ్‌నగర్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, మైత్రి యాదయ్య, బాలగోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ ల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి



అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా నుండి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ,ఆర్.డి. ఓ నవీన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



నారాయణపేట జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర : ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ ల తో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ఓటర్ల మ్యాపింగ్, బూత్ స్థాయి అధికారుల శిక్షణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో పురోగతి సాధించాలని, బూత్ స్థాయి అధికారులు మ్యాపింగ్ త్వరితగతిన చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం జరిగేలా కృషి చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్లకు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు శిక్షణ సంబంధిత మెటీరియల్ అందజేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల పోస్టులు ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని, ఎక్కడైనా ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారులను నియమించాలని తెలిపారు. పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) శ్రీను సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కలిసిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 4(విజన్ ఆంధ్ర) ; రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్ హనుమకొండలోని టీజీఎన్‌పీడీసీఎల్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గ శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.దఈ సందర్భంగా కలెక్టర్ నవీన్ మిట్టల్ గారికి మొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లాలో విద్యుత్ సరఫరా, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, టీజీఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంకొండ వారింట పెళ్లి సందడి

## తిరుమలలో నిశ్చితార్థం.. హైదరాబాద్‌లో గ్రాండ్ వెడ్డింగ్



టాలీవుడ్‌లో మరో శుభవార్త సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి సిద్ధమవుతున్నారు. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆయన వివాహ వార్తలకు ఇప్పుడు స్పష్టత లభించింది. తాజా సమాచారం ప్రకారం, సాయి శ్రీనివాస్ నిశ్చితార్థం ఈ నెల 5న పవిత్ర క్షేత్రమైన తిరుమలలో జరగనుంది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నిశ్చితార్థంతో వివాహ కార్యక్రమాలకు అధికారికంగా శ్రీకారం చుడుతున్నారు. నిశ్చితార్థం అనంతరం వివాహాన్ని ఈ నెల 29న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. నగరంలోని వారి ప్రైవేట్ ఫామ్ హౌస్‌లో ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఇప్పటికే సాయి శ్రీనివాస్ తండ్రి, ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇటీవలే సాయి శ్రీనివాస్ రోకా వేడుక కుటుంబ సభ్యుల మధ్య సాదాసీదాగా జరిగింది. ఆయనకు కాబోయే వధువు కావ్య రెడ్డి హైదరాబాద్‌కు చెందిన యువతి. సినీ పరిశ్రమతో ఆమెకు సంబంధం లేకపోయినా, ప్రముఖ న్యాయవాది కుటుంబానికి చెందినదిగా తెలుస్తోంది. కొంతకాలంగా వీరిద్దరూ పరిచయం పెంచుకుని ప్రేమలో ఉన్నారని, ఇప్పుడు ఇరువైపుల కుటుంబాల అంగీకారంతో వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నారని టాక్ వినిపిస్తోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ 'అల్లుడు శీను' సినిమాతో టాలీవుడ్‌లో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి, తర్వాత 'జయ జానకి నాయక', 'రాక్షసుడు' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. కమర్షియల్, యాక్షన్, థ్రిల్లర్ జానర్లలో నటుడిగా తన ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'హైందవ', 'టైసన్ నాయుడు' వంటి పలు ప్రాజెక్టులు ఉన్నాయి. కెరీర్ పరంగా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ, వ్యక్తిగత జీవితంలో కొత్త ప్రయాణానికి సిద్ధమవడం అభిమానులను ఆనందానికి గురి చేస్తోంది. ఈ వివాహ వేడుకలకు టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పాటు సినీ తారలు కూడా ఈ వేడుకల్లో పాల్గొననున్నారని టాక్.


# 'రామాయణ్'లో రణ్‌బీర్ డబుల్ రోల్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ త్వరలోనే వెండితెరపై డబుల్ రోల్‌లో సందడి చేయబోతున్నారు. డైరెక్టర్ నితీష్ తివారీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ్'లో రణ్‌బీర్ రెండు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు స్వయంగా ఆయనే వెల్లడించారు. ఇటీవలే హనుమాన్ జయంతి సందర్భంగా విడుదలైన 'రామ గ్లింప్స్'పై సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తోంది. ఈ గ్లింప్స్ విడుదలైన అనంతరం రణ్‌బీర్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఈ సినిమాలో తాను కేవలం శ్రీరాముడి పాత్ర మాత్రమే కాకుండా, విష్ణుమూర్తి మరో అవతారమైన మహర్షి పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు క్లారిటీనిచ్చాడు. దీంతో ఈ వార్త విన్న అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. శ్రీరాముడు ఒక అవతారమైతే, ఆయన కంటే ముందు వచ్చిన అవతారం పరశురాముడు. ఈ రెండు దివ్యమైన పాత్రలను ఒకే సినిమాలో చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఈ రెండు పాత్రల బాడీ లాంగ్వేజ్, స్వభావాలు వేరు. సినిమా షూటింగ్‌కు ముందు ఒక సంవత్సరం పాటు ఈ రెండు క్యారెక్టర్ల మూలాలను, వాటి వెనకున్న ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడ్డాను అని రణ్‌బీర్ పేర్కొన్నాడు. నమిత్ మల్హోత్రా దాదాపు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో రెండు భాగాలుగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా కన్నడ స్టార్ యశ్, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు.

## 'ఎల్లమ్మ'లో హీరోగా దేవి శ్రీ ప్రసాద్... దర్శకుడు వేణు ఎల్దండి సంచలన నిర్ణయానికి ఇదే కారణం!






'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్... ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించబోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా... కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు... 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు -- దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏది ఏమైన , వేణు ఎల్దండి తీసుకున్న ఈ ధైర్యవంతమైన నిర్ణయం ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. 'ఎల్లమ్మ' సినిమా ద్వారా దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా కూడా ప్రేక్షకులను మెప్పిస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.




## పెద్ది' రిలీజ్‌పై వచ్చిన క్లారిటీ.. ఏప్రిల్ 30కే గ్రాండ్ ఎంట్రీ!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. 'రంగస్థలం' తర్వాత పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంలో చరణ్ నటిస్తున్న చిత్రం కావడంతో అభిమానులు ఈ సినిమాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూ స్తున్నారు. ఇటీవల శ్రీరామనవమి సందర్భంగా విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. చరణ్ మాస్ లుక్, ఆయన నటన మెగా అభిమానులను ఫుల్ జోష్‌లోకి తీసుకెళ్లిం ది. ఈ సినిమాతో బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా ఈ సినిమా రిలీజ్‌పై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. మొదటగా అనుకున్నట్టుగా ఏప్రిల్ 30న విడుదల కాకుండా జూన్‌కు వాయిదా పడుతుందని ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో రిలీజ్ డేట్ ప్రస్తావించకపోవడం కూడా ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఇంకా సినిమా షూటింగ్ పూర్తి కావడానికి సుమారు 20 రోజులు ఉందని, ఒక ఐటెం సాంగ్ పెండింగ్‌లో ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ సమయానికి పూర్తవుతుందా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రామ్ చరణ్ స్వయంగా క్లారిటీ ఇచ్చారు. 'రాకాస' సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న ఆయన, 'పెద్ది' వాయిదా పడటం లేదని స్పష్టం చేశారు. ప్లాన్ ప్రకారం సినిమా ఏప్రిల్ 30నే థియేటర్లలోకి వస్తుందని బలమైన సంకేతాలు ఇచ్చారు. ఇప్పటికే చిత్ర యూనిట్ వేగంగా పనులు పూర్తి చేస్తోంది. మిగిలిన షూటింగ్‌ను, ముఖ్యంగా ఐటెం సాంగ్‌ను, కేవలం వారం రోజుల్లో ముగించి ఫైనల్ అవుట్‌పుట్ సిద్ధం చేయడానికి మేకర్స్ కృషి చేస్తున్నారు. ఇక రిలీజ్‌పై వస్తున్న రూమర్లు కేవలం పుకార్లేనని డిస్ట్రిబ్యూటర్ల సమాచారం చెబుతోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఇప్పటికే ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. విశ్వసనీయ వర్గాల ప్రకారం, ఏప్రిల్ 8 నుంచి ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. దీంతో ఏప్రిల్ 30 రిలీజ్ దాదాపు ఖాయం అయిందని సినీ వర్గాలు అంటున్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియ్యమ్మ' పాత్రలో కనిపించనుండగా, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ 'గౌర్నాయుడు'గా, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ 'రాంబుజ్జి'గా నటిస్తున్నారు. అలాగే జగపతి బాబు 'అప్పలసూరి' పాత్రలో కీలకంగా కనిపించనున్నారు. వీరితో పాటుబొమన్ ఇరాని, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.ఈ సినిమాకు సంగీతాన్ని ఆస్కార్ విజేత రెహమాన్ అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రం రూపొందుతోంది.

# మరోసారి అంతర్జాతీయ వేదికపై రష్మిక..



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న తన క్రేజ్‌ను మరోసారి అంతర్జాతీయ స్థాయిలో చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉన్న జపనీస్ యానిమేషన్ వేడుక 'క్రంచీరోల్ యానిమే అవార్డ్స్'లో ప్రజెంటర్‌గా వ్యవహరించేందుకు ఆమె ఎంపికయ్యారు. మే 23న జపాన్‌లోని గ్రాండ్ ప్రిన్స్ హోటల్ షిన్ టకనవాలో ఈ 10వ వార్షికోత్సవ వేడుక అట్టహాసంగా జరగనుంది. రష్మిక ఈ వేదికపై ప్రజెంటర్‌గా కనిపించడం ఇది రెండోసారి కావడం విశేషం. ఈ విషయాన్ని రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "మళ్లీ జపాన్‌కు.. యానిమే వెనుక ఉన్న అద్భుతమైన వ్యక్తులను సెలబ్రేట్ చేయడానికి వెళ్తున్నా" అంటూ క్యాప్షన్ జోడించారు. 2024లో జరిగిన వేడుకలో తొలిసారి ప్రజెంటర్‌గా పాల్గొని, ఈ ఘనత సాధించిన మొదటి భారతీయ సెలబ్రిటీగా రష్మిక చరిత్ర సృష్టించారు. ఇప్పుడు రెండోసారి కూడా అదే అవకాశం దక్కించుకోవడం ద్వారా గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ఆమెకున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఈసారి వేదికపై ఆమెతో పాటు అసుకా సైతో, డానా పవోలా, విన్‌స్టన్ డ్యూక్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు కూడా ప్రజెంటర్లుగా వ్యవహరించనున్నారు. రష్మికకు యానిమేషన్ ప్రపంచంతో మంచి అనుబంధం ఉంది. 'జుజుట్సు కైసెన్', 'డీమన్ స్లేయర్' వంటివి తన ఫేవరెట్ అని ఆమె పలు సందర్భాల్లో చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలో క్రంచీరోల్ బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రష్మిక ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి ఆమె నటించిన 'కాక్‌టెయిల్ 2' జూన్ 19న విడుదల కానుంది. చాలా కాలం తర్వాత భర్త విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో 'రణబాలి' అనే పీరియడ్ యాక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. వీటితో పాటు గిరిజన నేపథ్యంతో వస్తున్న 'మైసా' అనే యాక్షన్ డ్రామా వంటి భారీ చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి. ఇలా ఒకవైపు ప్రాంతీయ సినిమాల్లో అగ్రతారగా కొనసాగుతూనే, మరోవైపు గ్లోబల్ పాప్ కల్చర్‌లో తనదైన ముద్ర వేస్తూ రష్మిక ముందుకు సాగుతున్నారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీ నామ




ఖమ్మం, ఏప్రిల్ 4 ( విజన్ ఆంధ్ర) : గజ్వేల్‌లో ప్రధాన ప్రతిపక్ష నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలుస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలు హింసకు దారి తీయకూడదని, ఇలాంటి ఘటనలు జరగడం సరైంది కాదని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే, ఇక సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధుల కార్యాలయాల భద్రత బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీస్తాయని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మండలకేంద్రంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం.



జన్నారం,ఏప్రిల్ 4(విజన్ ఆంధ్ర) : జన్నారం మండల కేంద్రంలో శనివారం రోజున ఉదయం క్రై స్తవుల ఆధ్వర్యంల రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.యేసుక్రీస్తు పునరుత్థాన పండుగ పురస్కరించుకొని క్రైస్తవులు స్థానిక సి హెచ్ఐ చర్చి నుండి ఇండియన్ పెట్రోల్ బంక్ వర కు తిరిగి అక్కడినుండే సిఎస్ఐ చర్చి వరకు భారీ ర్యాలీగా భక్తి గీతాలు ఆలపిస్తూ పరుగులో క్రైస్తవు లు ఉత్సవంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసుక్రీస్తు యొక్క పునరుత్థానం అనే సందేశాన్ని ప్రకటిస్తుందని,రన్ ఫర్ జీసస్ ర్యాలీ అనేది యేసు క్రీస్తు మరణం మరియు పున రుత్థానం యొక్క సందేశాన్ని బహిరంగంగా ప్రకటిం చడానికి, గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ మధ్య వచ్చే పవిత్ర శనివారం నాడు నిర్వహించబడే ఒక క్రైస్తవ సువార్త మరియు సర్వమత కార్యక్రమం,కానీ రన్ ఫర్ జీసస్ కేవలం ఒక ర్యాలీ మాత్రమే కాదు,ఇది విశ్వాసం, బలం మరియు ఐక్యత యొక్క శక్తివంత మైన వేడుక, ఇది నిరీక్షణ మరియు ప్రేమ సందేశా న్ని వ్యాప్తి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవులు,పాస్టర్స్ అభిషేక్, ధమ్మా శామ్యూల్, క్రిష్టి యన్ యూత్ లీడర్స్ మంద రాజేష్,పస్నేట్ పాల్, కొప్పుల రాము,ముగాల అజాయ్ కుమార్,తుడుం ప్రభాకర్, విశ్వాసులు, మహిళలు, యువతి,యు వకులు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలి

**- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



కొత్తగూడెం బ్యూరో ఏప్రిల్ 05 (విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని వేగవంతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో సహకరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.శనివారం హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల వారీగా ఇప్పటికే అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు (ఏఈఆర్ఓలు), బూత్ లెవెల్ అధికారులకు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకంపై సమావేశాలు నిర్వహించినందున, ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఇంకా సమావేశాలు జరగని ప్రాంతాల్లో వెంటనే సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు సంబంధిత యాప్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, ఓటరు వివరాల మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు . ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి ఇప్పటికే 61.25 శాతానికి చేరుకుందని తెలిపారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, ప్రతి మండలంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం పెంచి బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భూదాన్ పోచంపల్లి ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర : హయత్‌నగర్‌కు చెందిన సుమాయన నాజ్ తెలిపిన ప్రకారం, ఆమె తమ్ముడు వీణ అఫ్జల్ రేజా (22 సంవత్సరాలు) జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తూ కొంతకాలంగా జూలూరు గ్రామంలో నివసిస్తున్నాడు శు క్రవారం సాయంత్రం తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్ వెళ్తుండగా, మార్గమధ్యంలో బైక్‌ను రోడ్డు పక్కన ఆపిన సమయంలో, ఒక లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఈనెల 9 నుంచి 24 వరకు 'ప్రధాన్ మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్'

**- గ్రామీణ యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీయడమే ప్రధాన లక్ష్యం**

**- ఎంపి డి.కె అరుణ**



మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా బ్యూరో ఏప్రిల్ 4 విజన్ ఆంధ్ర : మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఏప్రిల్ 9 నుంచి 24 వరకు నిర్వహించనున్న 'ప్రధాన్ మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్' ద్వారా గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని మహబూబ్‌నగర్ యం. పి డి. కె అరుణ పేర్కొన్నారు. ఈ క్రీడా మహోత్సవానికి సంబంధించి శనివారం మహబూబ్‌నగర్‌లోని ఐ.డి ఓ.సి కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల, అసెంబ్లీ స్థాయి ఇన్‌చార్జులు, జిల్లా విద్యా శాఖ అధికారులు, యువజన క్రీడాశాఖ అధికారులు, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు సమన్వయంతో పని చేసి ఈ క్రీడ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవం ఏప్రిల్ 9న నారాయణపేటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి జట్లు ఏప్రిల్ 6లోపు ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 9 నుంచి 15 వరకు మండల స్థాయి పోటీలు, ఏప్రిల్ 15 నుంచి 20 వరకు అసెంబ్లీ స్థాయి పోటీలు, ఏప్రిల్ 21 మరియు 22 తేదీల్లో పార్లమెంటరీ స్థాయి పోటీలు నిర్వహించబడతాయని చెప్పారు. ఏప్రిల్ 23న పరుగు పందాలు నిర్వహించబడతాయని, ఏప్రిల్ 24న బహుమతుల ప్రదానోత్సవం మరియు ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఆ రోజున తెలంగాణ గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడా మహోత్సవంలో కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, క్రికెట్ అనే నాలుగు ప్రధాన క్రీడలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ప్రతి క్రీడకు ఒక కోఆర్డినేటర్ చొప్పున నలుగురిని నియమించి పోటీల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. క్రీడా వేదికల వద్ద సరైన మైదానాలు, గ్రౌండ్ మార్కింగ్, నీడ కోసం టెంట్లు, తాగునీటి సదుపాయం, అలాగే గాయాల నివారణకు తగిన వైద్య సదుపాయాలు మరియు ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీలు సజావుగా సాగేందుకు పోలీసు భద్రతను కూడా కల్పించాలని సూచించారు. యువత శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, డ్రగ్స్ వంటి చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఎంపీ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లకు అలవాటు పడిన పిల్లలకు కూడా ఇది మంచి అవకాశమని, తమ ప్రతిభను చాటుకునే వేదికగా ఉపయోగించుకోవాలని యువతను పిలుపునిచ్చారు. మండల ఇన్‌చార్జులు నమోదు చేసుకున్న జట్లకు క్రీడా కిట్లు పంపిణీ చేసి, పీఈటీలతో సమన్వయం చేసుకుని పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ క్రీడలలో పురుషులతో పాటు స్త్రీలు, బాలికలకు కూడా ప్రాముఖ్యత ఇచ్చి వారిని క్రీడలలో పాల్గొనేవిధంగా ప్రోత్సహించాలని యం.పి. డి.కె అరుణ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, నారాయణపేట జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్, జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి రెడ్డి, వనపర్తి జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ మల్లికార్జున్, పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, మండల స్థాయి ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సహజ మరణానికి కూడా 10 లక్షల ఉచిత బీమా పథకం అమలు

**- యాజమాన్యం చొరవతో యూనియన్ బ్యాంక్ నిర్ణయం**

**- ఈ నెల 1 వ తేదీ నుండి అమలు**

కొత్తగూడెం బ్యూరో ఏప్రిల్ 05 (విజన్ ఆంధ్ర) : ఇప్పటివరకు సింగరేణిలో కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న యూనియన్ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు సహజ మరణం చెందిన కార్మికులకు కూడా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు లేదా అధికారులు ఎవరైనా సరే మృతి చెందినట్లయితే వారికి పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి సంస్థకు బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది. సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్ మరియు ఫైనాన్సు గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి రానున్నట్లు బ్యాంకు యాజమాన్యం పేర్కొంది. 2024 లో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సింగరేణి కార్మికులకు ఉచిత కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని యూనియన్ బ్యాంకు అమలు జరిపింది. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా సహజ మరణానికి కూడా 10 లక్షల రూపాయల ప్రమాద బీమాను వర్తింపజేస్తూ నిర్ణయించినట్లు యూనియన్ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలలో 10 లక్షల బీమా పాలసీ తీసుకోవాలంటే నెలకు కనీసం ఐదు వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవ వల్ల ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా యూనియన్ బ్యాంకు సహజ మరణానికి 10 లక్షల బీమా పథకాన్ని అమలు జరిపింది. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. కాగా సింగరేణి సంస్థలో కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు జరుపుతున్న ఇతర బ్యాంకులు కూడా ఇదే విధంగా సహజ మరణానికి కూడా బీమా సౌకర్యాన్ని వర్తింప జేసే విధంగా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుంటోంది.

# అందుబాటులో వైద్యం ప్రభుత్వాల బాధ్యత

**- 80% వైద్యం కార్పొరేట్, ప్రైవేట్ చేతుల్లో**



ఖమ్మం ఏప్రిల్ 4 ( విజన్ ఆంధ్ర ) : పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ప్రముఖ వైద్యులు యలమంచిలి రవీంద్రనాథ్, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ఆరోగ్యం శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక అంశాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. దీనిలో ఒక శారీరక రుగ్మతలకు మాత్రమే డాక్టర్లు వైద్యం అందిస్తారని చెప్పారు. మిగతా అంశాలు ప్రభుత్వాల తీరుపై ఆధారపడి ఉంటాయని అన్నారు. బీపీ, షుగర్ నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపు దశాబ్ద కాలం పూర్తవుతున్న సందర్భంగా బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే) – సీపీఐ (ఎం) ఖమ్మం 2 టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో శనివారం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపు సభలో ముఖ్య ఉపన్యాసం చేశారు. వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురివెళ్ల ప్రవీణ్ కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త భీమనాదుల పుల్లారావు, డాక్టర్ చీకటి భారవి, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ఈ క్యాంపునకు ముఖ్య అతిథులుగా హాజరయ్ ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ రవీంద్రనాథ్, సుదర్శన్ రావు మాట్లాడారు. పవిత్రమైన వృత్తులన్నీ వ్యాపారీకరించబడతాయని కారల్ మార్క్స్ చెప్పినట్టుగానే వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 80 శాతం వైద్యం కార్పొరేట్, ప్రైవేట్ చేతుల్లో ఉండగా 20% మాత్రమే ప్రభుత్వ ఆధీనంలో ఉందని అన్నారు. ఫార్మా పరిశ్రమ అంతా ప్రైవేటు, విదేశీ కంపెనీల చేతుల్లో ఉందన్నారు. కేవలం 18 శాతం మందులపై మాత్రమే ప్రభుత్వ నియంత్రణ ఉందని తెలిపారు. ఫార్మా కంపెనీలకు ప్రయోజనాలు చేకూరుస్తూ 9000 కోట్లు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పొందడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

ఆకలి సూచీలో ప్రపంచంలోనే 123 దేశాల్లో ఇండియా 102 వ స్థానంలో ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. స్థూల ఆదాయంలో .5% మాత్రమే వైద్యంపై ఖర్చు చేస్తున్నారంటే అవమానకరం అన్నారు. ప్రతి లక్ష మందిలో చైనాలో 29 ప్రసూతి మరణాలు సంభవిస్తుంటే . ..దేశంలో 145 చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సీపీఐ(ఎం) అధికారంలో ఉన్న కేరళలో వెయ్యి మందికి 5 శిశు మరణాలు చోటు చేసుకుంటుంటే బిజెపి పాలిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, యూపీల్లో 36 మంది చనిపోతున్నారని తెలిపారు. రూ. 100 ఫీజు తో నెలకు సరిపడా మందులు అందిస్తూ పదేళ్లుగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆరోగ్య రంగహౌస్ కమిటీ సభ్యుడిగా దివంగత ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు పేదలకందే వైద్య సేవలపై చూపించిన శ్రద్ధను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

# ఘనంగా ప్రేమ, క్షమాపణల సందేశం



కల్లూరు,ఏప్రిల్04(విజన్ ఆంధ్ర ) : పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఎఐసిసి మండల కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, క్షమాపణల సందేశాన్ని ప్రజల్లో విస్తరించాలనే ఉద్దేశంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది. జిల్లా ప్రేయర్ సెల్ అధ్యక్షులు రెవరెండ్ నిర్మల్ కుమార్ ప్రార్థనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఎన్ఎస్పి క్రాస్ రోడ్డు నుండి నూతన బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించగా, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ ఏనోష్ కుమార్, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ సురేష్, సిఎస్ఐ చర్చ్ పాస్టర్ రెవరెండ్ భాస్కరరావు హాజరై రిబ్బన్ కట్ చేసి ర్యాలీని ప్రారంభించారు. వారు ర్యాలీలో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు.యేసు సందేశం ప్రపంచానికి మార్గదర్శకం అని తెలిపారు. యేసుక్రీస్తు ప్రభువు నరవతారిగా లోకానికి వచ్చాకే ప్రేమ, క్షమాపణల అసలైన అర్థం మానవాళికి తెలిసిందని తెలిపారు. యేసు ప్రభువు బోధనలు ప్రపంచానికి శాంతి, సమాధానాన్ని అందించాయని పేర్కొన్నారు. ఆయన జననం, సిలువపై మరణం, పునరుత్థానం ద్వారా మానవాళికి నిత్య రక్షణ, నిత్యజీవం, నిత్య రాజ్యాన్ని సిద్ధం చేశారని వివరించారు. యేసు క్రీస్తు పాపభారాన్ని తొలగించేందుకు లోకరక్షకుడిగా ఈ లోకానికి వచ్చాడని, మానవాళికి సమాధానం చూపించేందుకు సమాధానకర్తగా జన్మించాడని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమాజంలో శాంతి, సౌభాగ్యం నెలకొంటుందని పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ పర్వదినాల సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేశ క్షేమం, శాంతి, భద్రత, సౌభాగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమం కల్లూరులో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపుతూ ఏసుక్రీస్తు సందేశాన్ని ప్రజలలో విస్తరించిన ఒక విశేష కార్యక్రమం గా నిలిచింది. ఈ కార్యక్రమంలో మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షులు రెవరెండ్ ఎబినేజర్, నియోజకవర్గ అధ్యక్షులు పీడీ దాసు, కన్వీనర్ కెనడి రాజు, గౌరవ సలహాదారులు బ్రదర్ టి. సంజీవరావు, ఎఐసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పెరుమాళ్ల దయాకర్, వైస్ ప్రెసిడెంట్ జాన్ పరంజ్యోతి, సుందర్ రాజు, ప్రధాన కార్యదర్శి రాయల తిమోతి, కోశాధికారి గౌడిపేరు జీవన్ కుమార్, మండల నాయకులు మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదూరి రాజశేఖర్, ప్రచార కార్యదర్శి థామస్, బాల సుందరం, షాలెం దాసన్న, సత్తుపల్లి మండల అధ్యక్షులు రవి, తల్లాడ, వైరా మండలాల అధ్యక్షులు మరియు ఇతర నాయకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చింతగూడ గ్రామంలో ఐదు రోజులపాటు ఆధార్ స్పెషల్ క్యాంప్

జన్నారం, ఏప్రిల్ 4 (విజన్ ఆంధ్ర) : చింతగూడ గ్రామంలో ఐదు రోజుల పాటు ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారని పోస్టల్ ఏఎస్ పి రామా రావు, సర్పంచ్ సూతరి సుమలత వినయ్ తెలిపా రు.జన్నారం మండలం చింతగూడ గ్రామంలో ఈ నెల 6 తేదీ నుండి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని శని వారం రోజున పోస్టల్ ఏ ఎస్ పి రామారావు, గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ కార్డులో తప్పొప్పుల సవరణ, ఫోటో అప్డేట్, ఫోన్ నంబర్, అడ్రస్ మార్పు చేసుకోవడం ,పుట్టినతేదీ, సంవత్స రం తదితర వాటిని సవరణలు చేసుకోవచ్చని, గ్రా మ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ద

## శ్వాస కోశ క్యాన్సర్ కు గురైన యువకుడికి కేర్ వైద్యుల అరుదైన శస్త్రచికిత్స




హైదరాబాద్, ఏప్రిల్ 04 (విజన్ ఆంధ్ర) : క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న ఓ యువకుడికి కేర్ హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సతీష్ పవార్ నేతృత్వంలోని మల్టీడిసిప్లినరీ సర్జరీ బృందం క్లిష్ట శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ప్రాణాలు కాపాడారని కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ జోనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నిలేష్ గుప్తా శనివారం ఒక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని యవత్మాల్‌కు చెందిన 30 ఏళ్ల మనోజ్ భానుదాస్‌కు థైరాయిడ్ క్యాన్సర్ శ్వాసనాళం(ట్రాకియా) వరకు వ్యాపించి, తీవ్రమైన శ్వాస సమస్యను కలిగించిందన్నారు. ఈ పరిస్థితి ప్రాణాపాయం దాకా వెళ్లే అవకాశం ఉండడంతో అత్యవసరంగా శస్త్రచికిత్స చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం రోగి సురక్షితంగా కోలుకుంటూ, మళ్లీ సాధారణంగా శ్వాస తీసుకుంటున్నట్లు చెప్పారు. మనోజ్ కోలుకుని డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళ్లారని తెలిపారు.

## పాత కక్షలతో హత్య

**- ప్రమాదంగా చిత్రీకరించే యత్నం**

నాగర్ కర్నూల్,ఏప్రిల్4 : పాత కక్షలు ఓ వ్యక్తి ప్రాణాలు తీశాయి. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తిని ప్రత్యర్థులు టిప్పర్‌తో ఢీకొట్టి హతమార్చారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. భూతగాదాల విషయంలో పాత లక్షలుండటంతో మహేష్ అనే వ్యక్తిని కారులో ప్రయాణిస్తుండగా.. ప్రత్యర్థులు టిప్పర్ ఢీ కొట్టారు. అనంతరం ఈ ఘటనను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. భూ తగాదాలకు సంబంధించి అడ్డు వస్తున్నాడని మహేశ్‌ను ప్రత్యర్థులు దాడి చేసి చంపినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.